




# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 78 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 07-10-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

డబ్బుకు లోకం దాసోహం
ఎందుకు అంత మోహం !
బట్టకు పాట్టకు లోటు లేదు
కొంపలు కోటలకు తక్కువ కాదు
ఐనా ఆశలు ఆకాశంలో
వంటికి కష్టం లేదు
మనసుకు సుఖం లేదు
అడ్డదారి సంపాదన
ఆలోచనలతో కంటికి నిద్ర లేదు.
సాటి వారితో పోలికలు
తోటి వారితో పోటీలు
కోరికలే గుర్రాలైతే
"కళ్మో" లేక "బళ్మె"మవును.
ఆశల ఆకాశంలో విహరిస్తూ
కలల సాకార యత్నం
ఐనవారిని ఆత్మబందువుల వదిలి
కడకు కన్నవారిని,తోబుట్టువుల వదిలి
పుడమి అంచులు ఆకాశం ఎత్తులు
కడలి లోతులు కాసుల వేటకు
కాని చోటులు లేవంటూ తిరుగుతున్నరు.
మనిషి "ధన దాహం" తీర్చు
"మనసు" కట్టడి తప్ప,
నెరవేర్చు చోటు లేదంటూ
తెలువకున్నరు..

రాజి రెడ్డి శీలం.ఇనుగుర్తి



# ఎర్రవల్లి భూముల్లో 45 ఎకరాలు ఎక్కడ.. ?

- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- సర్వే నంబర్ 325లో 388 ఎకరాలుగా రికార్డులు
- క్షేత్రస్థాయి సర్వేలో 343 ఎకరాలే గుర్తింపు
- మిగిలిన 45 ఎకరాల ఆచూకీ తేల్చాలని ఆదేశం
- కేసీఆర్ కుటుంబానికి రెవెన్యూ రికార్డులపై నోటీసులు
- అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేక కాలనీ నిర్మాణం

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల భూముల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రెండు గ్రామాల్లో అధికారులు చేపట్టిన భూ సర్వే వివరాలను సీఎంకు నివేదించారు.

### 388 ఎకరాలు.. 343 ఎకరాలే గుర్తింపు

ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో రికార్డుల ప్రకారం 388 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. అయితే క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు తెలిపారు. దీంతో రికార్డులకు, వాస్తవ సర్వేకు మధ్య 45 ఎకరాల తేడా రావడంపై సీఎం ఆరా తీశారు. మిగిలిన 45 ఎకరాలు ఎక్కడ ఉన్నాయో కచ్చితంగా తేల్చాలని అధికారులను ఆదేశించారు.

### ఎర్రవల్లి, వెంకటాపురంలో సర్వే

45 ఎకరాల భూమి గుర్తింపుతో పాటు సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చి భూమి విస్తీర్ణంలో తేడాకు కారణాన్ని తేల్చాలని సూచించారు.

### కేసీఆర్ కుటుంబానికి నోటీసులు

సర్వే నంబర్ 325 భూముల సరిహద్దుల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధిత రెవెన్యూ రికార్డులు సమర్పించాలని అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం. భూముల సరిహద్దులు, రికార్డులను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

### అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక కాలనీ

సర్వే నంబర్ 325లో గుర్తించే ప్రభుత్వ భూమిలో తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు సకల మౌలిక వసతులతో కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు. నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన వచ్చే జూన్ 2లోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని గడువు విధించారు.

### అర్హులైన రైతులకు భూముల పంపిణీ

సర్వే నంబర్ 325లో భూముల గుర్తింపు, ప్రభుత్వ భూమి నిర్ధారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత స్థానికంగా అర్హులైన రైతులకు భూములను పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించనుంది. భూముల రికార్డులు, క్షేత్రస్థాయి సర్వే ఆధారంగా తదుపరి నిర్ణయాలు తీసుకోనున్నారు.



# ఈసీ భేటీపై కీలక ప్రకటన

- 240 మంది ఎంపీల ప్రతిపాదన అసాధారణం
- సాయంత్రం 4 గంటల వరకు ఎవరూ సమయం కోరలేదన్న ఈసీ
- ఢిల్లీ పోలీసుల ద్వారా తర్వాత సమాచారం అందిందని వెల్లడి
- 2025లోనే రాజకీయ పార్టీల భేటీలకు విధానం రూపొందించామని స్పష్టీకరణ
- పార్లమెంట్ అనెక్స్‌లో 240 మంది ఎంపీలతో భేటీ ప్రతిపాదన
- ఈసీ కార్యాలయంలోనే భేటీలు జరగాలన్న ఎన్నికల సంఘం




**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ కూడా అధికారికంగా తమను కలిసేందుకు సమయం కోరలేదని స్పష్టం చేసింది. సాయంత్రం 4 గంటల తర్వాత ఢిల్లీ పోలీసుల ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఎంపీల ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలవాలనుకుంటున్నట్లు సమాచారం అందిందని తెలిపింది.

### 2025లోనే భేటీలకు విధానం

రాజకీయ పార్టీలతో సమావేశాలకు సంబంధించి 2025లోనే ప్రత్యేక విధానాన్ని రూపొందించినట్లు ఈసీ వెల్లడించింది. ఏదైనా రాజకీయ పార్టీ లేదా పలు పార్టీల సంయుక్త ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలవాలంటే, అధికారికంగా నియమిత ప్రతినిధి ద్వారా ముందుగా సమయం కోరాలని స్పష్టం చేసింది. ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సమావేశ తేదీ, సమయం ఖరారవుతాయని పేర్కొంది.

### పార్లమెంట్ అనెక్స్ ప్రతిపాదనపై అభ్యంతరం

రాహుల్ గాంధీ నేతృత్వంలో

మిగతా 2లో

## మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలి

2 లో

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలి
- రామాయంపేటలో జీడిమామిడి మొక్కలు నాటిన గవర్నర్
- రామాయంపేట–సిద్దిపేట మధ్య 45 కిలోమీటర్ల మేర మొక్కలు
- దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపు
- అభివృద్ధి కార్యక్రమాలను సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని సూచన



# రేవంత్, కేసీఆర్ కుటుంబాల ఆస్తులపై విచారణ జరపాలి

- హైకోర్టు సీజేకు రఘునందన్ లేఖ
- సీఎం రేవంత్, కేసీఆర్ కుటుంబాల ఆస్తులపై సమగ్ర విచారణకు డిమాండ్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పరస్పర ఆరోపణలపై న్యాయ విచారణ కోరిన ఎంపీ
- ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులనూ పరిశీలించాలని విజ్ఞప్తి
- భూములు, వ్యాపారాలు, ఆస్తులపై అధికారిక రికార్డులు పరిశీలించాలని లేఖ
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ ఫిర్యాదు చేస్తానని వెల్లడి

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య కొనసాగుతున్న ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కీలక చర్యకు దిగారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వారి కుటుంబ సభ్యుల ఆస్తులు, భూములు, వ్యాపార ప్రయోజనాలపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ సమర్పించారు.



### ఆరోపణలపై నిజానిజాలు తేల్చాలి

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై ఒకరు చేస్తున్న ఆస్తుల ఆరోపణల నిజానిజాలను స్వతంత్రంగా తేల్చాల్సిన అవసరం ఉందని రఘునందన్‌రావు పేర్కొన్నారు. సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, కంపెనీలు, పన్నులు, ఎన్నికల అఫిడవిట్లకు సంబంధించిన అధికారిక రికార్డులను

మిగతా 2లో

# ఉద్యోగాల పేరుతో రష్యాకు.. సైన్యంలోకి తెలంగాణ యువకులు

- విదేశీ ఉద్యోగాల పేరుతో ఏజెంట్ల మోసం
- వంటవాళ్లు, క్లీనర్లు, మెకానిక్ ఉద్యోగాలంటూ నమ్మబలికిన వైనం
- రష్యాలో సైనిక శిక్షణ ఇచ్చారన్న బాధితుల ఆరోపణలు
- 16 మందిలో ముగ్గురు స్వదేశానికి.. 13 మంది ఇంకా అక్కడే
- గౌరవ్ చౌదరిని అరెస్ట్ చేసిన నిజామాబాద్ పోలీసులు
- యువకులను స్వదేశానికి రప్పించాలని కేంద్రానికి ఎంపీ అర్వింద్ లేఖ

**నిజామాబాద్, ప్రజా వాయిస్:** విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి తెలంగాణకు చెందిన యువకులను రష్యాకు తీసుకెళ్లి.. అక్కడ సైనిక నియామక వ్యవస్థలోకి చేర్చారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వంటవాళ్లు, క్లీనర్లు, మెకానిక్‌లు, తోటల నిర్వహణ, ఇతర సహాయక ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఏజెంట్లు యువకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు బాధిత కుటుంబాలు ఫిర్యాదు చేశాయి.



### ఉద్యోగాల పేరుతో ఉచ్చులోకి

నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు యువకులు ఈ వ్యవహారంలో చిక్కుకున్నట్లు సమాచారం. రష్యాలో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసా, ప్రయాణ ఏర్పాట్లు చేస్తామని నమ్మించి డబ్బులు తీసుకున్నారని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. అక్కడికి వెళ్లిన తర్వాత పౌర ఉద్యోగాలకు బదులుగా సైనిక శిక్షణకు పంపించారని చెబుతున్నారు.


### ప్రకాశ్ ఉదంతంతో వెలుగులోకి

ధర్పల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన మెగావత్ ప్రకాశ్ ఉదంతం ఈ వ్యవహారాన్ని మరింత చర్చనీయాంశంగా మార్చింది. రష్యాలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో వీసా, ప్రయాణ ఖర్చుల కోసం రూ.2.4 లక్షలు చెల్లించినట్లు సమాచారం. రష్యాకు వెళ్లిన ప్రకాశ్ ఓ ప్రైవేటు సంస్థలో నాలుగు నెలలపాటు పనిచేసినట్లు తెలుస్తోంది. ఆ

మిగతా 2లో

# ఫామ్-7తో ముస్లిం ఓట్ల తొలగింపునకు కుట్ర

- అసదుద్దీన్ ఓవైసీ ఆరోపణ
- గోషామహల్‌లో ప్రీ-ప్రింటెడ్ ఫామ్- 7లపై ఓవైసీ ఆరోపణలు
- ఒక్క వ్యక్తి 122 ఫామ్-7లు ఎలా సమర్పించారంటూ ప్రశ్న
- ముస్లిం ఓటర్లనే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపణ
- పెద్ద సంఖ్యలో ఫామ్-7లు ఇచ్చిన వారిపై కేసులు పెట్టాలని డిమాండ్
- సీఈసీ ఎంపిక విధానంలో మార్పులు చేయాలని కోరిన ఎంఐఎం అధినేత



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఫామ్-7 దుర్వినియోగం జరుగుతోందని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. గోషామహల్ నియోజకవర్గంలో ప్రీ-ప్రింటెడ్ ఫామ్-7లను ఉపయోగించి ముస్లిం ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఎన్నికల అధికారులు విచారణ జరిపి వాస్తవాలను తేల్చాల్సి ఉంది.

### 122 ఫామ్-7లపై ప్రశ్నలు

గోషామహల్‌లోని పోలింగ్ కేంద్రం 28 పద్ద ఒక వ్యక్తి 122 ఫామ్-7 దరఖాస్తులు సమర్పించారని ఓవైసీ తెలిపారు. ఆ దరఖాస్తుల్లో ఓటర్ల పేర్లు ముందుగానే ముద్రించి ఉన్నాయని, వాటిని ఎవరు, ఎక్కడి నుంచి తీసుకొచ్చారో తేల్చాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో ఫామ్-7లు సమర్పించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని కోరారు.

### ముస్లిం ఓటర్లనే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపణ

గోషామహల్‌లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ముస్లిం ఓటర్ల పేర్ల తొలగింపునకు ఫామ్-7లు సమర్పించారని ఓవైసీ ఆరోపించారు. ప్రీ-ప్రింటెడ్ దరఖాస్తుల వెనుక ఉన్న వ్యక్తులు, వాటి మూలం, ఉద్దేశాన్ని ఎన్నికల సంఘం సమగ్రంగా పరిశీలించాలని కోరారు. అయితే ఈ ఆరోపణలు ప్రస్తుతం ఓవైసీ చేసినవే కాగా, ఎన్నికల అధికారులు దర్యాప్తు అనంతరం వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

### పెద్ద సంఖ్యలో దరఖాస్తులపై చర్యలు

తెలంగాణ సీఈవో ఇప్పటికే ఫామ్-6, 6ఏ, 7, 8ల్లో తెలిసి తప్పుడు సమాచారం ఇచ్చే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన విషయాన్ని ఓవైసీ ప్రస్తావించారు. తప్పుడు ఫామ్-7లు సమర్పించినట్లు తేలితే బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### సీఈసీ ఎంపిక విధానంపై అభ్యంతరం

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఎంపిక విధానం కూడా మార్చాలని ఓవైసీ డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో సీఈసీ ఎంపిక జరిగేలా పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన అన్నారు.

# 27 లక్షల మందికి ఒకేసారి అల్పాహారం.!

- ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వినూత్న కార్యక్రమం
- విద్యార్థుల పౌష్టికాహారమే.. రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడి: భట్టి
- సంక్షేమం ఉచితం కాదు.. మానవ వనరులపై పెట్టుబడే
- బీఆర్ ఎస్ కు గతమే తప్ప భవిష్యత్తు లేదు
- మళ్లీ ఎందుకు వస్తారో చెప్పాలి
- ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్

**ప్రజా వాయిస్,కోదాడ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో వేడివేడి అల్పాహారం అందించడం ప్రపంచంలోనే ఎక్కడా లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం విద్యార్థుల పౌష్టికాహారంపై ప్రభుత్వానికి ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమన్నారు. పిల్లలకు అందిస్తున్న సంక్షేమాన్ని ఉచితంగా చూడొద్దని.. రాష్ట్ర భవిష్యత్ మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడిగా చూడాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఎదిగితేనే రాష్ట్ర ఉత్పాదకత, జీఎస్‌డీపీ వృద్ధి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లా మునగాలలో రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. 1,020 పాఠశాలల్లోని సుమారు 60 వేల మంది విద్యార్థులకు ఒకే వంటశాల నుంచి పరిశుభ్రమైన వాతావరణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అల్పాహారం అందించేలా ఈ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు భట్టి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు. మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ ఇస్తున్నట్లు వివరించారు. ఇంటి వద్ద వంద మందికి వంట చేయడమే కష్టమైన పరిస్థితుల్లో 27 లక్షల మందికి ఏకకాలంలో అల్పాహారం అందించడం సాధారణ విషయం కాదన్నారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని, ఎదిగే వయసులో పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన మానవ వనరులను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

### సంక్షేమం.. రేపటి వృద్ధికి పెట్టుబడి

పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చును 'ఉచితాలు'గా చూడొద్దని భట్టి అన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రజల ఆర్థిక సామర్థ్యం పెరిగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతమై జీఎస్‌డీపీ వృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

### 'మళ్లీ ఎందుకు వస్తారో చెప్పాలి'

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలపై భట్టి ఘాటుగా స్పందించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చేది ఎందుకో ప్రజలకు చెప్పాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఆపేందుకా సన్నబియ్యం నిలిపివేసేందుకా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ నిలిపివేసేందుకా మహిళలకు వడ్డీలేని రుణాలు ఆపేందుకా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు.

### నవంబర్ 19న 'ఇందిరమ్మ కుటుంబ బీమా'

ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే లక్ష్యంతో 'ఇందిరమ్మ కుటుంబ బీమా' పథకాన్ని తీసుకురానున్నట్లు భట్టి ప్రకటించారు. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానికి అనుకోని ప్రమాదం సంభవిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భద్రత కల్పించేలా పథకాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు.

### ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో పాఠశాల

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని భట్టి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే చోట చదువుకునేలా వీటిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతోపాటు క్రీడా మైదానాలు, స్టేడియం తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

### ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం: ఉత్తమ్

గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. రూ.200 కోట్ల భారీ వ్యయంతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పాఠశాలను నిర్మిస్తున్నామని తెలిపారు. పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందని, పేద విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన ఆదరణను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి హుజూర్‌నగర్ నియోజకవర్గం లక్షకు పైగా మెజార్టీ అందించిందన్నారు. తనను పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలే తనకు దేవుళ్లని పేర్కొన్నారు.భట్టి విక్రమార్క రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానం కలిగిన నాయకుడని ఉత్తమ్ కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భట్టి సహకారంతో హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.



### 500 బైక్ లతో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

మునగాల హెలిప్యాడ్ నుంచి కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన ప్రాంతం వరకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్, తహసీల్దార్ ప్రవంతి, హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం యువత ముందుకు రావాలి

**మెదక్, ప్రజా వాయిస్:** మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా రామాయంపేటలో మంగళవారం పర్యటించిన ఆయన.. మెదక్–సిద్దిపేట జాతీయ రహదారి 765 డీజీ వెంట జీడి మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు.

### 45 కిలోమీటర్ల మేర జీడిమామిడి మొక్కలు

రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు జాతీయ రహదారికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర జీడిమామిడి మొక్కలను నాటనున్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రహదారి వెంట పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు.

### మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు విముక్తి

ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం సంకల్పిస్తే ఏదైనా సాధించి తీరుతుందని అన్నారు. గతంలో గ్రామాల్లో తుపాకుల గర్జనలు వినిపించేవని, అలాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని పేర్కొన్నారు.

### దేశ నిర్మాణంలో యువత కీలకం

దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని గవర్నర్ సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా వాటి నుంచి కాపాడేందుకు యువత చొరవ చూపాలని పిలుపునిచ్చారు. యువత శక్తిని సద్వినియోగం చేసుకుంటే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు.

## రేవంత్, కేసీఆర్ కుటుంబాల ఆస్తులపై విచారణ జరపాలి

### మొదటి పేజీ తరువాయి

పరిశీలించాలని కోరారు.

### రూ.లక్ష కోట్లు.. రూ.50 వేల కోట్ల ఆరోపణలు

కేసీఆర్ కుటుంబంపై కాంగ్రెస్ నేతలు సుమారు రూ.లక్ష కోట్ల అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రఘునందన్‌రావు తన లేఖలో ప్రస్తావించారు. అదే సమయంలో రేవంత్‌రెడ్డి కుటుంబం గత రెండున్నరేళ్లలో రూ.50 వేల కోట్ల మేర సంపాదించిందంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మొత్తాలకు సంబంధించిన ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారిక పత్రాల ఆధారంగా తేల్చాలని కోరారు.

### ఎన్నికల అఫిడవిట్లపైనా పరిశీలన

రేవంత్‌రెడ్డి, కేసీఆర్ కుటుంబ సభ్యులు ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులతో పాటు అదనంగా భూములు, ఆస్తులు లేదా వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని రఘునందన్‌రావు కోరారు. పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, ప్రజా వేదికలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన వివరాలను సేకరించి తన ఫిర్యాదుకు జత చేసినట్లు తెలిపారు.

### కేటీఆర్ డిమాండ్ నేపథ్యంలోనే ఫిర్యాదు

ఇరు కుటుంబాల ఆస్తులపై సిట్టింగ్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కేటీఆర్ ఇటీవల డిమాండ్ చేసిన విషయాన్ని కూడా రఘునందన్‌రావు తన లేఖలో ప్రస్తావించారు. రాజకీయ ఆరోపణలకు బదులుగా అధికారిక రికార్డుల ఆధారంగా స్వతంత్ర విచారణ జరగాలని కోరారు.

### సుప్రీంకోర్టు సీజేకూ ఫిర్యాదు

ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా ఫిర్యాదును తపాలా ద్వారా పంపనున్నట్లు రఘునందన్‌రావు తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశంపై న్యాయపరమైన పరిశీలన జరగాలని, ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారిక ఆధారాలతో తేలాలని ఆయన కోరారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

- 67 రోజుల తర్వాత జైలు నుంచి విడుదల
- మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో నమోదైన కేసులో బెయిల్
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన ఉప్పర్‌పల్లి కోర్టు
- సుమారు 67 రోజులుగా చంచల్‌గూడ జైలులో రిమాండ్
- జూలైలో అత్తాపూర్ పోలీసులకు మహిళా అధికారి ఫిర్యాదు
- ఆరోపణలను గతంలో ఖండించిన ఉదయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నమోదైన కేసులో నిందితుడైన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్ లభించింది. రంగారెడ్డి జిల్లా ఉప్పర్‌పల్లి కోర్టు మంగళవారం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దాదాపు 67 రోజులుగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు కోర్టు తాజా ఉత్తర్వులతో ఊరట లభించింది.

### మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో కేసు

అకాడమీలో శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జూలై 8న తనను బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి బెదిరించి ఫోన్ పాస్‌వర్డ్ తీసుకున్నారని ఆమె ఆరోపించినట్లు పోలీసులు తెలిపారు.

### కత్తితో బెదిరించినట్లు ఆరోపణ

జూలై 9న కూడా తనను జుట్టు పట్టుకుని గదిలోకి లాక్కెళ్లి మెడపై కత్తి పెట్టి బెదిరించినట్లు మహిళా అధికారి ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వ్యక్తిగత వీడియోలు చిత్రీకరించి, వాటిని తన భర్తకు పంపి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### అరెస్టు.. జ్యుడీషియల్ రిమాండ్

కేసు నమోదైన అనంతరం పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్టు చేసి ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అప్పటి నుంచి సుమారు రెండు నెలలకు పైగా ఆయన జైలులోనే ఉన్నారు.

### ఆరోపణలను ఖండించిన ఉదయ్

తనపై వచ్చిన ఆరోపణలు, ప్రచారంలో ఉన్న పదంతులు నిరాధారమైనవని ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. అవన్నీ అవాస్తవాలని, న్యాయం గెలుస్తుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. అనంతరం బంధువుల ఇంటికి వెళ్లిన ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. బంధువులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స అనంతరం పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

## ఈసీ భేటీపై కీలక ప్రకటన

### మొదటి పేజీ తరువాయి

సుమారు 240 మంది ఎంపీలు ఎన్నికల సంఘాన్ని కలిసి వినతిపత్రం సమర్పించాలనుకుంటున్నట్లు ఢిల్లీ పోలీసుల ద్వారా సమాచారం అందిందని ఈసీ తెలిపింది. సమావేశానికి పార్లమెంట్ అనెక్స్‌ను వేదికగా ప్రతిపాదించినట్లు పేర్కొంది. అయితే ఈ ప్రతిపాదన అసాధారణమైనదని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలతో భేటీలు ఈసీ కార్యాలయ ప్రాంగణంలోనే జరగాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

### వినతిపత్రం స్వీకరించేందుకు ప్రత్యామ్నాయ ప్రతిపాదన

ఎంపీల వినతిపత్రాన్ని స్వీకరించేందుకు తమ సీనియర్ అధికారిని పంపుతామని ఎన్నికల సంఘం ప్రతిపాదించినట్లు తెలిపింది. ఇది కూడా అసాధారణమైన చర్యే అయినప్పటికీ, ఎంపీల ప్రతినిధి బృందం ఆ ప్రతిపాదనను తిరస్కరించిందని వెల్లడించింది.

### ఎవరైనా భేటీకి కోరవచ్చు

పార్లమెంటరీ, ప్రజాస్వామ్య ప్రక్రియలను గౌరవించడంతో పాటు తమ విధివిధానాలు, సంప్రదాయాలను కూడా ఎన్నికల సంఘం గౌరవిస్తుందని స్పష్టం చేసింది. ఏ రాజకీయ పార్టీ అయినా ఎప్పుడైనా ఎన్నికల సంఘంతో సమావేశం కోసం అభ్యర్థించవచ్చని పేర్కొంది. అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి భేటీ తేదీ, సమయాన్ని ఎన్నికల సంఘమే నిర్ణయిస్తుందని తెలిపింది.

## రాహుల్ అరెస్టుపై రేవంత్ ఫైర్

- సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాటం
- రాహుల్ సహా కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టును ఖండించిన రేవంత్
- ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని అణచడం సరికాదని వ్యాఖ్య
- అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని వెల్లడి
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం
- ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ఇండియా కూటమి మార్చ్

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ అరెస్టును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అహింసాయుతంగా ఉద్యమిస్తున్న నాయకులను బలవంతంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

### అరెస్టులు కాంగ్రెస్‌కు కొత్త కాదు

అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ నాయకులకు కొత్తేమీ కాదని రేవంత్ రెడ్డి అన్నారు. నాయకులను అరెస్టు చేసి జైళ్లలో పెట్టినంత మాత్రాన ఎన్నికల సంఘం తప్పిదాలపై కాంగ్రెస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో జరిగిన తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ విశ్రమించదని తేల్చిచెప్పారు.

### ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఇండియా కూటమి మంగళవారం ఢిల్లీలో భారీ నిరసన చేపట్టింది. పార్లమెంట్ స్ట్రీట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించింది. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది ఎంపీలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



### బారికేడ్లు దాటిన రాహుల్.. అరెస్టులు

నిరసన ర్యాలీని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపారు. వాటిని తొలగించుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు రాహుల్ గాంధీతో పాటు ఎంపీ ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను అరెస్టు చేశారు. పలువురు ఎంపీలు, కాంగ్రెస్ నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు.

### దేశ రాజధానిలో ఉద్రిక్తత

కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టుతో ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల సంఘం కార్యాలయం వరకు కొనసాగిన నిరసనతో దేశ రాజధానిలో కొంతసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఈసీ రాజీనామా, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ తన ఆందోళనలను కొనసాగించనున్నట్లు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఉద్యోగాల పేరుతో రష్యాకు.. సైన్యంలోకి తెలంగాణ యువకులు

### మొదటి పేజీ తరువాయి

సంస్థ మూతపడిన తర్వాత మరో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అదనంగా రూ.50 వేలు అడిగినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

### సైనిక నియామకంపై ఆరోపణలు

ప్రకాశ్‌ను గౌరవ్ చౌదరి వద్దకు తీసుకెళ్లారని.. అక్కడి నుంచి రష్యా సైన్యంలో నియామకానికి సంబంధించిన ప్రక్రియ జరిగిందని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. రష్యాకు చేరుకున్న తర్వాత హామీ ఇచ్చిన పౌర ఉద్యోగాలకు బదులుగా సైనిక శిక్షణ ఇచ్చారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. సుదీర్ఘ శారీరక శిక్షణ, తగినంత ఆహారం లేకపోవడం, నిద్రకు సరిపడా సమయం లేకపోవడం, నాసిరకం వసతుల్లో ఉండాల్సి రావడం వంటి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు స్వదేశానికి తిరిగివచ్చిన వారు చెబుతున్నారు.

### 16 మందిలో ముగ్గురు తిరుగు ప్రయాణం

రష్యాలో చిక్కుకున్న తెలంగాణ యువకుల్లో గుర్తించిన 16 మందిలో బండ లింగాపూర్‌కు చెందిన శేఖర్, కేశాపూర్‌కు చెందిన రాజశేఖర్, ధర్వల్లికి చెందిన తిరుపతి స్వదేశానికి తిరిగివచ్చినట్లు తెలుస్తోంది. మరో 13 మంది ఇంకా రష్యాలోనే ఉన్నట్లు సమాచారం. కొందరు వీడియోలు, సందేశాల ద్వారా తమ పరిస్థితిని వివరిస్తూ సహాయం కోరుతున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

### ఎంపీ అర్వింద్ లేఖ

రష్యాలో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకురావాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు లేఖ రాశారు. ఇప్పటికే కొందరి విడుదల, తిరుగు ప్రయాణానికి సహకరించిన కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### గౌరవ్ చౌదరి అరెస్ట్

ఈ కేసులో నిజామాబాద్ పోలీసులు గౌరవ్ చౌదరి(34)ని అరెస్ట్ చేశారు. అతడి బ్యాంకు ఖాతాలను రష్యా సైనిక నియామక సంస్థ ఉపయోగించుకుందని అతడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో అతడి పాత్ర ఏమిటి, రష్యా నియామక సంస్థతో సంబంధాలు ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కేంద్రం హెచ్చరిక

రష్యాలో రక్షణ రంగానికి సంబంధించిన ఉద్యోగాల పేరుతో వచ్చే అవకాశాలపై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం భారతీయులకు సూచించింది. గుర్తింపు లేని ఏజెంట్లను నమ్మవద్దని, ఉద్యోగం ఇచ్చే సంస్థ, వీసా రకం, ఉద్యోగ స్వభావం, వేతనం, ఒప్పంద నిబంధనలను ముందుగానే అధికారిక మార్గాల్లో ధ్రువీకరించుకోవాలని సూచించింది. ఉద్యోగం పేరుతో సైనిక సేవలోకి తీసుకెళ్తారన్న అనుమానం ఉంటే ప్రయాణాన్ని నిలిపివేసి సంబంధిత అధికారులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## సైబర్ నేరగాళ్ల మ్యూల్ ఖాతాలకు చెక్

- 100 మందికి పైగా ఏజెంట్లు అరెస్ట్
- దక్షిణాది ఐదు రాష్ట్రాల్లో భారీ ఆపరేషన్
- మ్యూల్ ఖాతాలు, కేవైసీ పత్రాలు సమకూర్చిన ఏజెంట్ల అరెస్ట్
- ఏజెంట్లకు దేశవ్యాప్తంగా సైబర్ నేరాలతో సంబంధాలు
- భారీగా డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లు స్వాధీనం
- రెండు వారాల పాటు కొన సాగిన ప్రత్యేక సోదాలు




హైదరాబాద్, ప్రజా వాయిస్: దక్షిణాది రాష్ట్రాల్లో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్ చేపట్టింది. సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు సమకూర్చడంతో పాటు, నకిలీ లేదా ఇతరుల పేర్లతో ఉన్న కేవైసీ పత్రాలను అందజేస్తున్న వంద మందికి పైగా ఏజెంట్లను పోలీసులు అరెస్ట్ చేశారు.

### ఐదు రాష్ట్రాల్లో సోదాలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక బృందాలు విస్తృతంగా సోదాలు నిర్వహించాయి. దాదాపు రెండు వారాల పాటు ఈ ప్రత్యేక ఆపరేషన్ కొనసాగినట్లు పోలీసులు తెలిపారు. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చడంలో కీలకంగా వ్యవహరించిన ఏజెంట్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

### భారీగా బ్యాంకు సామగ్రి స్వాధీనం

అరెస్టయిన నిందితుల నుంచి మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లు భారీగా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఖాతాలను సైబర్ నేరాల ద్వారా వచ్చిన నగదు బదిలీకి వినియోగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన పలు సైబర్ నేరాలతో సంబంధాలున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.

### హైదరాబాద్‌కు తరలించి విచారణ

వివిధ రాష్ట్రాల్లో పోలీసుల అదుపులో ఉన్న నిందితులను మంగళవారం రవాణా అనుమతి పత్రాలపై హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం వారిని ప్రత్యేక బృందాలు విచారించాయి. మ్యూల్ ఖాతాల వెనుక ఉన్న సైబర్ నేరగాళ్లు, నగదు లావాదేవీలు, ఇతర రాష్ట్రాల్లోని సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



# శివాయిపల్లి సర్పంచ్ భర్తకు రూ. 10,500 జరిమానా!

- శివాయిపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా చెట్ల నరికివేత
- పచ్చని చెట్లు నరికిన ఘటనపై స్పందించిన అటవీ శాఖ
- ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికేసిన వైనం
- గ్రామ సర్పంచ్ కు రూ. 10,500 జరిమానా విధించిన అధికారులు

**పెద్దశంకరంపేట (ప్రజా వాయిస్):**మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామంలో పచ్చని చెట్లను నరికివేసిన ఘటనపై అటవీ శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. గ్రామంలోని రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నరికివేసినందుకు గాను, గ్రామ సర్పంచ్‌కు రూ. 10,500 జరిమానా విధించినట్లు అటవీ అధికారి హిమచందన ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయన్న నెపంతో కొద్దిరోజుల క్రితం కొమ్మలకు బదులుగా ఏకంగా చెట్లనే పూర్తిగా నరికివేసిన విషయం తెలిసిందే. దీనిపై స్థానికుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో స్పందించిన అటవీ శాఖ విచారణ చేపట్టింది. విచారణలో అనుమతులు లేకుండానే చెట్లను నరికినట్లు తేలడంతో అటవీ శాఖ నిబంధనల ప్రకారం జరిమానా విధించారు. పర్యావరణానికి హాని కలిగిస్తూ, కనీస అనుమతులు లేకుండా పచ్చని చెట్లను నరికివేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని అటవీ అధికారి ఈ సందర్భంగా హెచ్చరించారు.

# నెక్కొండ గురుకులంలో రౌడీ టీచర్

- గురుకులంలో ఐదో తరగతి విద్యార్థులపై ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు కర్రలతో దాడి?
- 35 మంది విద్యార్థులను కర్రలతో కొట్టారంటూ తల్లిదండ్రుల ఆగ్రహం
- మూడు కర్రలు విరిగేలా దాడి చేశారనీ తల్లిదండ్రుల ఆరోపణ
- గాయాలపై ఐస్ ముక్కలతో మర్దన, చికిత్స చేయించి విషయం గోప్యంగా ఉంచే ప్రయత్నం
- ఉపాధ్యాయురాలు రజినిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్



**ప్రజా వాయిస్ వరంగల్ నెక్కొండ:** నెక్కొండ మండల పరిధిలోని జనరల్ సొసైటీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయురాలు కర్రలతో దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఆదివారం సాయంత్రం 5వ తరగతి బి సెక్షన్‌కు చెందిన సుమారు 35 మంది విద్యార్థులను ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయురాలు రజిని కర్రలతో కొట్టినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.విద్యార్థులు బాత్రూంకు వెళ్లే సమయంలో జారిపడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందనే కారణంతో వారిని కొట్టినట్లు పాఠశాల యాజమాన్యం సమాధానం ఇచ్చిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. అయితే, విద్యార్థులపై కర్రలతో దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

### మూడు కర్రలు విరిగేలా కొట్టారా?

35 మంది విద్యార్థులను కర్రలతో కొట్టడంతో మూడు కర్రలు విరిగినట్లు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు విద్యార్థుల శరీరాలపై గాయాలు, దెబ్బల గుర్తులు కనిపించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.తమ కుమార్తెను చూడటానికి గురుకులానికి వెళ్లిన ఓ విద్యార్థినీ తల్లిదండ్రులకు అసలు విషయం బయటపడినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయురాలు తమను కొట్టిందని విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీసి ఘటనపై వివరాలు అడిగినట్లు సమాచారం.

### విషయం బయటకు రాకుండా గోప్యంగా ఉంచే ప్రయత్నం

విద్యార్థులకు గాయాలు కావడంతో విషయం తల్లిదండ్రులకు తెలియకుండా ఉండేందుకు గాయాలపై ఐస్ ముక్కలతో మర్దన చేయడం ఇతర చికిత్సలు చేయడం జరిగిందని విద్యార్థులు తల్లిదండ్రులకు ఆరోపించడం జరిగింది దీనితో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారా అనే అనుమానాలు తల్లిదండ్రులు వ్యక్తం అవుతున్నాయి పిల్లల భద్రత రక్షణ బాధ్యత వహించాల్సిన పాఠశాలల్లోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

### ఉపాధ్యాయురాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల వాగ్మూలాలను నమోదు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు ఆరోపణలు నిజమని తెలితే విద్యార్థులపై దాడికి పాల్పడిన ఉపాధ్యాయురాలు రజిని పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనకు నిర్లక్ష్యం చేసిన పాటశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి సంబంధిత అధికారుల పర్యవేక్షణలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వారి గాయాలపై పూర్తిస్థాయిలో చికిత్స చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.పిల్లలను క్రమశిక్షణ పేరుతో కొట్టడం ఏమాత్రం సమంజసం కాదు ఒకవేళ ఉపాధ్యాయురాలు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ అయిన ఇలాంటి ప్రవర్తన కొనసాగితే మరింత మంది పిల్లలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు ఈ ఘటనపై స్థానిక అధికారులు విద్యాశాఖ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే సమాచారం అందుకున్న నర్సంపేట ఆర్డిఓ ఉమారాణి, నెక్కొండ మండల తహసిల్దార్ రాజకుమార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వ్యాసం లావణ్య రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులపై జరిగిన దాడి పై విచారణ చేపట్టి పాఠశాల ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# దత్తాయపల్లిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్

- ప్రజలతో మమేకమై సమస్యలపై ఆరా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై క్షేత్రస్థాయి పరిశీలన

**ప్రజావాయిస్/తుర్కపల్లి** యాదాద్రి భువనగిరి జిల్లాతుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మాట్లాడి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్నింగ్ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, మౌలిక వసతుల పరిస్థితి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణము లబ్ధిదారుల పరిస్థితి ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులు కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి పనులను పరిశీలిస్తూ దత్తాయ పల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ క్షేత్రస్థాయిలో పర్యటన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏవో శ్రీ ఉమా, ఎంఈఓ మంజుషా రాణి, విద్యుత్ శాఖ ఏఈ భిక్షపతి, హౌసింగ్ ఏఈ నరేష్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమత తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ జిట్ట బాలకృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు దేవరుప్పల ఐలయ్య, ఎరుకల వెంకటేష్ గౌడ్, దేవరుప్పుల మల్లేష్, గొప్ప లింగారెడ్డి ,నల్లరాజు, గుంటి రాజు, దానబోయిన నవీన్ .వార్డు సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు





# ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- మరమ్మతులు, క్రీడా మైదానం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బాలికల హాస్టల్, విద్యుత్ వ్యవస్థ, పాఠశాల పరిసరాలు, క్రీడా మైదానాన్ని పరిశీలించారు.బాలికల హాస్టల్‌లో కొన్ని గదులకు తలుపులు సక్రమంగా లేవని, పాఠశాలలో విద్యుత్ వైరింగ్‌కు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన మరమ్మతు పనులను వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్ ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనేలా పాఠశాల క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. మైదానంలో అవసరమైన గ్రౌండ్ లెవెలింగ్ పనులను పూర్తి చేసి, విద్యార్థులకు క్రీడలకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు.పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పాఠశాల పరిసరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాల, బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడంతోపాటు, ఇంటర్మీడియట్‌లో జిల్లా స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డీ బుల్బీ కౌర్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కోరుట్ల రవాణా శాఖ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక దాడులు

- పలు అక్రమాలు, తీవ్ర నిర్లక్ష్యాన్ని గుర్తించిన అధికారులు
- ఏజెంట్ల ద్వారా అదనపు వసూళ్లు, రికార్డుల నిర్వహణ అధ్వానం
- డ్రైవింగ్ ట్రాక్ వద్ద కనీస సైన్ బోర్డులు లేవని వెల్లడి

**ప్రజా వాయిస్, కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్లలోని రవాణా శాఖ యూనిట్ ఆఫీస్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కరీంనగర్ రేంజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కార్యాలయ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, చలాన్లు, పెండింగ్ దరఖాస్తులు మరియు ఆఫీసు నిర్వహణ తీరును పరిశీలించిన ఏసీబీ అధికారులు పలు తీవ్రమైన అక్రమాలను, లోపాలను గుర్తించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) లేని సమయంలో ఎన్.గిరీష్ కుమార్ అనే ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ డ్రైవింగ్ టెస్టులు నిర్వహించడంతో పాటు వాహనాల రిజిస్ట్రేషన్ల పరిశీలన చేస్తున్నట్లు తేలింది. అధికారిక పనుల కోసం మధ్యవర్తులు/ఏజెంట్ల ద్వారా సిబ్బంది ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. సాధారణ ప్రజలు చేసుకునే దరఖాస్తులకు సంబంధించి ఆఫీసులో ఏజెంట్లకు ఉచిత ప్రవేశం ఉంటూ, పనులు పూర్తయ్యే వరకు వారు ఆర్టీఏ సిబ్బందితో నేరుగా వ్యవహారాలు నడుపుతున్నారు. కార్యాలయంలో రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ ఏమాత్రం సరిగ్గా లేదు. క్రింది స్థాయి సిబ్బందికి కేటాయించిన విధులు, వారి పనితీరుపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్న స్థలం రవాణా శాఖ ప్రమాణాలకు అనుగుణంగా లేదు.డ్రైవింగ్ ట్రాక్ వద్ద ఎటువంటి కనీస సూచికలు (సైన్ బోర్డులు) లేవు. ఏదైనా ప్రభుత్వ అధికారి/సిబ్బంది లంచం అడిగితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికి ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), ఎక్స్ ((@తెలంగాణ ఏసీబీ ) ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.







# ఇంద్రానగర్‌లో పోలీసుల మెరుపు తనిఖీలు

- 50 బైక్ లు సీజ్.. ఆటో అదుపులోకి
- మద్యం, కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం
- ప్రజారోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదు
- నేర చరిత్ర కలిగిన వారిపై నిరంతర నిఘా తప్పనిసరి
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:** శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ లక్ష్యంగా వికారాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ స్వయంగా పాల్గొని కాలనీ వాసులతో మాట్లాడారు. సుమారు 85 మంది పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.కార్యక్రమంలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, నేరాలకు సంబంధం ఉన్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను అదుపులోకి తీసుకున్నారు. అలాగే 35 క్వార్టర్ మద్యం సీసాలు, 9 బీర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు.ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కల్తీ ఆహార పదార్థాలపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గుట్కా, మీరాజ్, కల్తీ ఆయిల్, రసగుల్లాలు, కల్తీ పాపడ్లు, చకోడీలు తదితర పదార్థాలను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులు, రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం ద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కాలనీల్లో నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, డీఏఆర్, క్యూ.ఆర్.టి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేను రాను బిడ్డో.. గజ్వేల్ దవాఖానకు!

- జిల్లా ఆసుపత్రి పనితీరు అధ్వానంగా ఉందంటూ విమర్శలు
- వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరతతో రోగుల అవస్థలు
- కోట్లతో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు అలంకారప్రాయమే
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ పేద రోగులపై ఆర్థిక భారం
- టీఆర్ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్



**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్** నియోజకవర్గం :గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రి, శిశు సంక్షేమ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, అవసరమైన సదుపాయాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నాయకులతో కలిసి జిల్లా ఆసుపత్రి, శిశు సంక్షేమ ఆసుపత్రులను సందర్శించిన ఆయన ఆసుపత్రుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ.. కోట్ల రూపాయలు వెచ్చించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినప్పటికీ అందుకు అనుగుణంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర విభాగాల్లో అవసరమైన సిబ్బందిని నియమించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గజ్వేల్ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాది మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నా వారికి తగిన వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. గజ్వేల్‌లో పెద్దస్థాయిలో ఆసుపత్రి నిర్మాణం చేపట్టినప్పటి నుంచి పలు సమస్యలు కొనసాగుతున్నాయని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిపై తగిన దృష్టి సారించలేదని విమర్శించారు. సకల సదుపాయాలతో ఆసుపత్రిని నిర్మించినట్లు గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. సరిపడా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వివిధ విభాగాల సాంకేతిక సిబ్బంది లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఇతర పట్టణాల్లోని ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వైద్య సిబ్బంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు పంపిస్తున్నారన్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందేలా అవసరమైన వైద్యులు, సిబ్బందిని వెంటనే నియమించి, అన్ని విభాగాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా మంత్రులు స్పందించి గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కొట్టాల యాదగిరి ముదిరాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగని రాజు, పట్టణ యువజన అధ్యక్షుడు కూరాకుల శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, కర్ణాకర్, సాయి, నందు, చందు, భాను తదితరులు పాల్గొన్నారు.

# ఇది కాంగ్రెస్ అసమర్థత తెచ్చిన 'కృత్రిమ కరవు'

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఫైర్
- రైతుల కష్టాలపై మాజీ ఎం ఎల్ ఏ క్రాంతి కిరణ్ సంచలన వ్యాఖ్యాలు
- రైతుల కన్నీళ్లకు ప్రస్తుత పాలకులే కారణం
- కేసీఆర్ హయాంలో స్వర్ణయుగం, నేడు మళ్లీ కరవు రాజ్యం
- సింగూర్ నీళ్లు, విద్యుత్ ను అందించడంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఘోర వైఫల్యం
- ఆందోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను వెంటనే కరవు మండలాలుగా ప్రకటించి, నష్టపరిహారం చెల్లించాలి
- రైతులకు నిరంతర విద్యుత్ ఇవ్వకపోతే ఖబర్దార్
- కాంగ్రెస్ సర్కార్ కు హెచ్చరిక





**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం ఉంటుందని వాతావరణ నివేదికలు ముందే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదని, పాలకుల ముందుచూపు లేని నిర్లక్ష్యం వల్లే నేడు రాష్ట్రంలో కరవు తాండవిస్తోందని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కష్టం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన 'కృత్రిమ కరవు' అని ఆయన ధ్వజమెత్తారు.మంగళవారం ఆందోల్ నియోజకవర్గంలోని పుల్కల్ మండలంలో నిర్వహించిన భారీ రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ధర్నాలో క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. "గడిచిన పదేళ్ల కేసీఆర్ గారి పాలనలో రైతాంగం రాజాలా బతికింది. పుష్కలంగా సాగునీరు, 24 గంటల నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్, సకాలంలో రైతుబంధు, రైతుబీమా ఇచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కుప్పకూల్చింది. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోకుండా, ఉన్న నీటిని నిలుపుకోలేక చేతులెత్తేశారు. చేతిలో బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ విద్యుత్ను ఉత్పత్తి చేయలేని చవట, దద్దమ్మ ప్రభుత్వమిది. పదేళ్ల పాటు రైతు కళ్లల్లో వెలుగులు నింపిన కేసీఆర్ పాలన ఎక్కడ? నేడు మళ్లీ రైతులను కరవు కోరల్లోకి నెట్టిన కాంగ్రెస్ పాలన ఎక్కడ?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ తీరుపై క్రాంతి కిరణ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "ఆందోల్ రైతాంగానికి జీవనాడి లాంటి సింగూర్ ప్రాజెక్టు నీటిని రైతులకు అందించడంలో, అక్కడ ఉత్పత్తి అయ్యే జల విద్యుత్ను స్థానిక వ్యవసాయ అవసరాలకు కేటాయించడంలో మంత్రి దామోదర ఘోరంగా విఫలమయ్యారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ రైతుల గోస పట్టించుకోని మంత్రికి పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదు. సొంత గడ్డపై రైతులు సాగునీరు లేక, కరెంట్ లేక పంటలు ఎండిపోతుంటే మంత్రి చోద్యం చూస్తున్నారు" అని నిప్పులు చెరిగారు. అన్ని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలిఆందోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పంటలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పోయి, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే ఆందోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి ఎకరానికి ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని స్పష్టం చేశారు.రైతుల సహనాన్ని పరీక్షించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ.. "వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ను వెంటనే పునరుద్ధరించాలి. మాటలతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేయాలని చూస్తే ఖబర్దార్! కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆగ్రహ జ్వాలల్లో భస్మమవడం ఖాయం. అన్నదాతలకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి పోరాటాలను ఉధృతం చేస్తుంది" అని హెచ్చరించారు. పుల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ అధ్యక్షత జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి తో పాటు పలు గ్రామాల సర్పంచ్ లు మాజీ సర్పంచ్ లు, ఇతర ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున రైతాంగం పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ఉచిత హిమోగ్లోబిన్ పరీక్షలు

- 300 మందికి పైగా విద్యార్థినులకు పరీక్షలు
- రక్తహీనత స్థాయిని తెలుసుకునే అవకాశం
- సమతుల పోషకాహారంపై వైద్యుల అవగాహన
- రక్తహీనత ఉన్న వారికి ఉచితంగా మందుల పంపిణీ
- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం




**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా** / గజ్వేల్ నియోజకవర్గం : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్లో జంతుశాస్త్ర విభాగం, ఆరోగ్య క్లబ్ ఆధ్వర్యంలో ఈశ్వర సాయి నర్సింగ్ హోమ్ సహకారంతో 300 మందికి పైగా విద్యార్థినులకు ఉచిత హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ.. హిమోగ్లోబిన్ పరీక్షల ద్వారా విద్యార్థినులు తమలో రక్తహీనత స్థాయిని తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ముందుగానే ఆరోగ్య పరిస్థితిని గుర్తించడం ద్వారా భవిష్యత్తులో తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థినులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఏ. శైలజ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మహిళల్లో హిమోగ్లోబిన్ ప్రాముఖ్యత, అది తగ్గడం వల్ల కలిగే సమస్యలు, సమతుల పోషకాహారం తీసుకోవాల్సిన అవసరం, పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా రక్తహీనతను నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో గుర్తించి అవసరమైన చికిత్స తీసుకోవాలని సూచించారు. హిమోగ్లోబిన్ స్థాయిలను సాధ్యమైనంతవరకు 12 గ్రాములు లేదా అంతకంటే ఎక్కువగా ఉండేలా పోషకాహారంపై శ్రద్ధ చూపాలని తెలిపారు. రక్తహీనతను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గర్భధారణ సమయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. పరీక్షల్లో రక్తహీనత ఉన్నట్లు గుర్తించిన విద్యార్థినులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో మెగా హాస్పిటల్, గజ్వేల్కు చెందిన వై. స్రవంతి మాట్లాడుతూ.. విద్యార్థినులు ముందుగానే హిమోగ్లోబిన్ స్థాయిలను పరీక్షించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కమలా క్రిస్టియానా, డాక్టర్ జే. ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.ఎం.లక్ష్మీ, క్లబ్ కన్వీనర్ పి.శ్రీలత, డాక్టర్ పి.జ్యోతి, వీరయ్య, దీపిక, అనురాధ, శృతి, డాక్టర్ పి.జయరాజు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

- గాంధీ రోడ్ దాడి ఘటనలో ఏ-1 నిందితుడు ఠాకూర్ వినయ్ సింగ్ రిమాండ్
- గతేడాది జూన్ నుండి పరారీలో ఉన్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు
- సాధింపు చర్యల్లో ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు




**ప్రజా వాయిస్, కోరుట్ల:**గతేడాది కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్లో జరిగిన సంచలనాత్మక హత్యాయత్నం, నేరపూరిత కుట్ర కేసులో గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. కోరుట్ల బస్స్టాండ్ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున చేపట్టిన చాకచక్యమైన ఆపరేషన్లో ఏ-1 నిందితుడు ఠాకూర్ వినయ్ సింగ్ (31)ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.పాత కక్షలతోనే దాడి.. పోలీసుల వివరాల ప్రకారం.. 2024 జూన్ 24న రాత్రి గాంధీ రోడ్లో పొగుల రాజేష్పై పాత కక్షల నేపథ్యంలో వినయ్ సింగ్ తన అనుచరులతో కలిసి పక్కా పథకం ప్రకారం దాడి చేసి హత్య చేసేందుకు యత్నించాడు. ఈ ఘటనపై కేసు (నెంబర్ .నం.341/2024) నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఇప్పటికే ఏ-2 నుంచి ఏ-6 వరకు ఉన్న నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, ప్రధాన నిందితుడైన వినయ్ సింగ్ అప్పటి నుంచి పరారీలో ఉంటూ పోలీసుల కంటికి చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు.కోరుట్ల సీఐ కె.లక్ష్మీనారాయణకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, ఎస్ఐ జి.శ్యామ్ రాజ్ తన సిబ్బందితో కలిసి బస్స్టాండ్ వద్ద నిఘా ఉంచి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో కాన్ఫెషన్ పంచనామా నిర్వహించిన అనంతరం అతడిని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తి చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా నిందితుడికి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. నేరాలకు పాల్పడి ఎంతకాలం పరారీలో ఉన్నా చట్టం నుంచి తప్పించుకోలేరని పోలీసులు హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. చాలా రోజులుగా పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్యామ్ రాజ్, పోలీస్ సిబ్బందిని జగిత్యాల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# ఓట్ల తొలగింపును నిలిపివేయాలి

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను బర్తరఫ్ చేయాలి
- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజా వాయిస్ గోదావరిఖని** ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ను తక్షణమే బర్తరఫ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. 'సర్' ప్రక్రియను రద్దు చేసి గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించాలని కోరారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో గెలవలేమనే భయంతోనే ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ ప్రక్రియను తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు. 2025 ఫిబ్రవరిలో వార్షిక ఓటర్ల జాబితా ప్రకటించిన ఆరు నెలల్లోనే మరో సవరణ చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చే విషయంలో క్షేత్రస్థాయి ఎన్నికల అధికారుల అధికారాలను ఈసీ పరిమితం చేస్తోందని విమర్శించారు. కోట్లాది మంది పౌరులను ఓటు హక్కుకు దూరం చేయడం రాజ్యాంగ విరుద్ధమని ప్రీతం పేర్కొన్నారు. అక్రమంగా తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో పౌరుడి భాగస్వామ్యానికి కీలకమైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# బీజేపీ నేత ' మహేందర్ రెడ్డి ' మృతి తీరని లోటు

- మృతుని కుటుంబానికి అండగా ఉంటాం
- మృతునికి నివాళులు
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**ప్రజా వాయిస్/దుబ్బాక :**బిజెపి చెల్లూర్ బ్లాక్ అధ్యక్షులు, వేణుగోపాలస్వామి ఆలయ కమిటి అధ్యక్షులు సత్తు మహేందర్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరం అని, అయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అన్నారు. మంగళవారం అయన మృతి తెలుసుకొని కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహం పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహేందర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. అయన కుటుంబానికి బిజెపి అండగా ఉంటుందని తెలిపారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటమని, అధైర్య పడొద్దు అని ధీమా వ్యక్తం చేశారు. అయనతో పాటు బిజెపి నాయకులు బాలేష్ గౌడ్, తిరుమల్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రోడ్డుపై ప్రయాణం

- పైల్వాన్ చెరువు రోడ్డు దుస్థితి ఇద
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్న వాహనదారులు
- పంచాయతీ రాజ్ అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు

**(ప్రజా వాయిస్ షాబాద్)**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని పైల్వాన్ చెరువు సమీపంలో ఉన్న ప్రధాన రహదారి దుస్థితి దారుణంగా తయారైంది సరిగ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో నడిరోడ్డుపైనే నిలువునా పెద్ద ఎత్తున బిటలు పడి రోడ్డు విరిగిపోయింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు స్థానిక గ్రామీణులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు చిత్రంలో స్పష్టంగా కనిపిస్తున్నట్లుగా రోడ్డు మధ్యలోనే నిలువుగా మరియు అడ్డంగా భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు వెళ్లే సమయంలో టైర్లు ఈ పగుళ్లలో ఇరుక్కుపోయి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో ఈ పగుళ్లు కనిపించక నిత్యం చిన్నా పెద్దా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు స్థానిక గ్రామాల ప్రజలు ప్రతిరోజూ పనుల నిమిత్తం పాఠశాలలు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్డు పైనే ప్రయాణించాల్సి వస్తోంది ఇప్పటికైనా సంబంధిత రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ఈ పైల్వాన్ చెరువు రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# సుఖాంతమైన బాలుడి అదృశ్యం కేసు

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** కంది మండలం కోయగుండు తండాకు చెందిన 15 ఏళ్ల బాలుడు ప్రదీప్ రాజ్ మిస్సింగ్ కేసు ఎట్టకేలకు సుఖాంతమైంది. ఈ నెల 21న స్కూలుకు వెళ్లే క్రమంలో అదృశ్యమైన బాలుడిని పోలీసులు 15 రోజుల పాటు తీవ్రంగా గాలించి హైదరాబాద్లో గుర్తించారు. సంగారెడ్డిలోని సెంట్ ఆన్స్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రదీప్ రాజ్ అదృశ్యమైన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పంకజ్ కేసును స్వయంగా పర్యవేక్షించారు. బాలుడు అదృశ్యమైన మరుసటి రోజు నుంచే ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ ముందుకు సాగిన పోలీసులు మంగళవారం సాయంత్రం హైదరాబాద్లోని భరత్నగర్ రైల్వే స్టేషన్ వద్ద బాలుడి ఆచూకీని గుర్తించారు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు బాలుడు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. 15 రోజుల అనంతరం తమ కుమారుడి ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి మధుసూదన్ రెడ్డి, కానిస్టేబుళ్లు రామకృష్ణ, రాజు, షకీర్, సాయి కుమార్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# "పిల్లల ప్రాణాలతో చెలగాటమా?"

- గుడ్లలోనూ నాసిరకం.. నల్లటి మచ్చలు
- సరఫరా వ్యవస్థలో లోపం..
- పర్యవేక్షణ కొరవడింది..




**ప్రజా వాయిస్,కొమరం భీం ఆసిఫాబాద్:** కడుపు నింపి, బలాన్ని ఇవ్వాల్సిన పౌష్టికాహారంలోనే పురుగులు కనిపించడంతో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. కాగజ్నగర్ డివిజన్లోని గమన్పంచి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం నుంచి పంపిణీ చేసిన బాలామృతంలో పురుగులు, బూజు బయట పడటంతో చిన్నారుల తల్లులు తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్న ఈ నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ప్యాకెట్ లోపల పురుగులు

అంగన్వాడీ కేంద్రానికి వెళ్లిన తల్లులు బాలామృతం ప్యాకెట్లు, కోడిగుడ్లు తీసుకుని ఇళ్లకు వెళ్లారు. ఓ తల్లి పిల్లాడికి పాలు కలపడానికి ప్యాకెట్ విప్పగానే ఘాటైన వాసన వచ్చింది. దగ్గరగా పరిశీలించగా పొడి మొత్తం తెల్లటి బూజు పట్టి, అందులో పెద్ద పెద్ద తెల్ల పురుగులు కదులుతూ కనిపించాయి. భయంతో ఆ తల్లి కేకలు వేయడంతో చుట్టుపక్కల తల్లులు అందరూ తమ ప్యాకెట్లు విప్పి చూశారు. దాదాపు అందరి ప్యాకెట్లలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో వెంటనే అంగన్వాడీ కేంద్రం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు.

### "కళ్లు మూసుకుని పెట్టి ఉంటే?""

మేము గమనించాం కాబట్టి సరిపోయింది. గమనించకుండా నీళ్లలో కలిపి పిల్లలకు తాగించి ఉంటే పరిస్థితి ఏమిటి? చిన్న పిల్లలు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యేవారు. ప్రాణాలకే ముప్పు వచ్చేది. ఇది పౌష్టికాహారమా? విషాహారమా?" అంటూ ఓ తల్లి కన్నీళ్లతో ప్రశ్నించింది. మరో తల్లి మాట్లాడుతూ "మాకు డబ్బులు లేక ప్రభుత్వం ఇచ్చే దానిపైనే ఆధారపడుతున్నాం. ఇలా పాడైపోయిన సరుకు ఇస్తే మా పిల్లలకు పోషణ ఎలా అందుతుంది?" అని నిలదీసింది.

### గుడ్లలోనూ నాసిరకం..

బాలామృతం ఒక్కటే కాదు, కేంద్రం ద్వారా సరఫరా అవుతున్న కోడిగుడ్ల నాణ్యత కూడా దారుణంగా ఉందని తల్లులు వాపోతున్నారు. గుడ్డు పగల గొడితే పచ్చసొన చుట్టూ నల్లటి మచ్చలు, లోపల నుంచి కుళ్లిన వాసన వస్తోందని చెబుతున్నారు. చాలా గుడ్లు పగిలిపోయి, పాడైపోయి వస్తున్నాయని, పిల్లలు వాటిని ముట్టుకోవడానికి కూడా ఇష్టపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చర్యల డిమాండ్ కేంద్రం నుంచే సరఫరా అవుతున్న ఈ గుడ్ల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### కోట్లు ఖర్చు చేస్తున్నా ఫలితం శూన్యమా?

రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, 6 నెలల నుంచి 6 ఏళ్లలోపు చిన్నారుల్లో పోషకాహార లోపం, రక్తహీనతను అరికట్టడానికి ఐసీడీఎస్ ద్వారా ప్రతినెలా బాలామృతం, కోడిగుడ్లు, బియ్యం, పప్పు ఉచితంగా పంపిణీ చేస్తోంది. దీని కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. కానీ సరఫరా చేసే కాంట్రాక్టర్లు నిల్వ ఉండి, గడువు ముగిసిన సరుకును



అంటగడుతున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సీడీపీఓలు, సూపర్వైజర్లు స్టాక్ను తనిఖీ చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

### వైద్యుల హెచ్చరిక

పాడైపోయిన, పురుగులు పట్టిన ఆహారం చిన్నారులు తింటే ఫుడ్ పాయిజనింగ్, తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారుల్లో ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. కాబట్టి నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని సూచిస్తున్నారు.

### పునరావృతం కాకుండా చూసుకోవాలి

జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో పురుగులు పట్టిన బాలామృతం, కుళ్లిన గుడ్లు పంపిణీ అవుతున్న ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని తల్లులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.నిల్వ ఉన్న నాసిరకం స్టాక్ను వెంటనే సీజ్ చేసి ఫుడ్ ల్యాబ్కు పంపి నాణ్యత పరీక్షలు నిర్వహించాలి. నాసిరకం సరుకు సరఫరా చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్లిస్టులో పెట్టి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.ప్రతి నెలా పంపిణీకి ముందే మండల స్థాయిలో నాణ్యత తనిఖీలు తప్పనిసరి చేయాలి. గోదాముల్లో నిల్వ పద్ధతులను మెరుగుపరిచి, గడువు ముగిసిన సరుకు పంపిణీ కాకుండా పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలి. చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు.

# వరుస చోరీల కేటుగాడు కటకటాల్లోకి!

- ఒంటరిగా దొరికితే అంతే సంగతులు బెల్లంపల్లి 'చింటూ' అసలు భాగోతం బయటపడింది
- తాళం వేస్తే చాలు.. వాలిపోతాడు ఆ కిలాడీ దొంగ కథ ముగిసింది



**ప్రజా వాయిస్ : / జైపూర్** మంచిర్యాల క్రైమ్తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న ఒక అంతర్-జిల్లా దొంగను జైపూర్ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జైపూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఈ కీలక ముఠా గుట్టు రట్టయినట్లు జైపూర్ సబ్-ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) భూమేష్ తెలిపారు.

### సిరీస్ దొంగతనాల గుట్టురట్టు

పోలీసుల కథనం ప్రకారం... బెల్లంపల్లి కాంట్రాక్టర్ బస్తీకి చెందిన సబ్బాని లక్ష్మీనారాయణ అలియాస్ చింటూ (27) అనే వ్యక్తి తన స్నేహితుడైన మహ్మద్ మగ్దూంతో కలిసి గడిచిన కొంతకాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సెప్టెంబర్ 28న ఇందారం గ్రామంలోని రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి పెద్ద ఎత్తున బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. ఈ చోరీ సొత్తును నిందితులిద్దరూ పంచుకున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు.గతంలోనే లక్ష్మీనారాయణ సహచరుడు మహ్మద్ మగ్దూంను అరెస్టు చేసిన పోలీసులు, అతని వద్ద నుంచి దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలు, నగదును రికవరీ చేశారు. ప్రధాన నిందితుడైన లక్ష్మీనారాయణ పరారీలో ఉండగా, తాజాగా పక్కా సమాచారంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

### పాత నేరాల చరిత్ర

విచారణలో నిందితుడు లక్ష్మీనారాయణ అనేక పాత నేరాలను సైతం అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు:*జనవరి 16: బెల్లంపల్లి రైల్వే రాదగంబల బస్తీలోని ఒక ఇంట్లో చోరీ.*జూలై 9: గాంధీనగర్లో తాళం వేసిన ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువుల అపహరణ.*సెప్టెంబర్ 24: ఇందారం గ్రామంలో ఇళ్ల తాళాలు పగలగొట్టి ల్యాప్టాప్, సెల్ఫోన్, వెండి వస్తువులు, నగదు దొంగతనం. తాజాగా నిందితుడి వద్ద నుంచి సుమారు 2 తులాల వెండి కాళ్ల పట్టీలు, రూ. 3,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్కు తరలించారు

### పోలీసుల హెచ్చరిక ప్రజలకు సూచనలు

ఇల్లు వదిలి బయటకు వెళ్లే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ భూమేష్ విజ్ఞప్తి చేశారు. సుదీర్ఘ ప్రయాణాలు చేసే సమయంలో విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఇళ్లలో ఉంచకుండా లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. కాలనీలు, గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కి సమాచారం అందించాలని కోరారు.



# సూరారం గ్రామానికి అండర్ పాస్ కోసం గ్రామస్తుల మహా ధర్నా

- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు
- ఒకవైపు బయోగ్యాస్ వాసన..? మరోవైపు అండర్ పాస్ లేక ఇబ్బందులు

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని సూరారం బస్టాండ్ వద్ద ఎన్ హెచ్ 563 రహదారిపై సూరారం గ్రామ ప్రజలు మహాధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన యువత ప్రజలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్ హెచ్ 563 రహదారి గ్రామాన్ని ఆనుకొని ఉండడంతో రహదారి దాటేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. విద్యార్థులు రైతులు వాహనాదారులు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారి నిర్మాణం కారణంగా సరైన రహదారి మార్గం లేకపోవడంతో గ్రామస్తులు మంగళవారం ఎన్ హెచ్ 563 జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. సూరారం గ్రామానికి వెళ్లేందుకు అండర్ పాస్ ఏర్పాటు చేసి శాశ్వతంగా రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలో సుమారు 50 శాతం మంది గొల్ల కురుమ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయని వారి వద్ద వేల సంఖ్యలో గొర్రెలు, మేకలు, పశువులు, ఎడ్లు, ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. రహదారి సౌకర్యం లేక పోవడంతో పశువులను కులాలకు మేతకు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో గ్రామానికి రాకపోకలు కూడా కష్టతరంగా మారుతున్నాయని తెలిపారు. గ్రామస్తులు జాతీయ రహదారిపై వాహనాలను నిలిపివేసి సుమారు గంటపాటు నిరసన చేపట్టారు. సూరారం గ్రామానికి దారి కల్పించాలి.. అండర్ పాస్ ఏర్పాటు చేయాలి అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఎల్కతుర్తి సీఐ శ్రీను అక్కడికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి ధర్నా విరమించాలని సూచించారు. జాతీయ రహదారిపై వాహనాలను నిలిపివేయడం వల్ల ప్రయాణికులకు వాహనాదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆయన తెలిపారు. గ్రామస్తుల సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన కారులు ధర్నాలు విరమించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నరసింహారావు, ఏఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామానికి శాశ్వత రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు అండర్ పాస్ నిర్మించాలని గ్రామస్తులు సంబంధిత అధికారులు జాతీయ రహదారుల శాఖ అధికారులను కోరారు.

# బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా

- ముత్తారంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం.
- ప్రమాద సమయంలో బీమా అండగా నిలుస్తుంది:
- సీఐ భరత్ సుమన్.
- విద్యుత్ షాక్ తో మృతి చెందిన మల్లయ్య కుటుంబానికి రూ.6.72 లక్షల బీమా చెక్కు అందజేత.




**ప్రజా వాయిస్ /పాలకుర్తి/** అక్టోబర్ 06: అనుకోని ప్రమాదాలతో కుటుంబ పెద్దను కోల్పోయిన వేళ బీమా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని పాలకుర్తి సీఐ భరత్ సుమన్ అన్నారు. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన పొర్ల మల్లయ్య ఇటీవల విద్యుత్ షాక్తో మృతి చెందారు. ఈ నేపథ్యంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో మల్లయ్య కుటుంబానికి రూ.6.72 లక్షల బీమా చెక్కును సీఐ భరత్ సుమన్ అందజేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ స్థోమతకు అనుగుణంగా బీమా పాలసీ తీసుకోవాలని సూచించారు. అనుకోని ప్రమాదాలు, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో బీమా ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని భవిష్యత్ భద్రత కోసం బీమాను ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వినయ్ గౌడ్, ఏజెంట్ గజ్జి రాజు, ముత్తారం సర్పంచ్ చింతకింది అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యశస్వినిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు

- ధర్మగడ్డ తండా సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం
- పెండింగ్ పనులు పూర్తి చేసి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసిన ధర్మగడ్డ తండా ప్రజలు.

**ప్రజా వాయిస్/పాలకుర్తి/అక్టోబర్ 06**జనగామ జిల్లా:దేవరుప్పుల మండలం,ధర్మగడ్డ తండాలో బీఆర్ఎస్కు చెందిన వార్డు సభ్యులు,పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ అభ్యర్థి మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్లో చేరుతున్నారని పేర్కొన్నారు.అన్ని వర్గాల సంక్షేమంతో పాటు గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అనంతరం ధర్మగడ్డ తండాలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరిస్తూ మూడ దేవేందర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.తండాలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యురాలు భూక్య బికినీతో పాటు భూక్య శ్రీనివాస్, భూక్య సోమ్లా, బానోత్ శ్రీనివాస్, మూడ మహేష్, మూడ మనోజ్ తదితరులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్, కాంగ్రెస్ మండల వీవర్స్ సెల్ అధ్యక్షుడు నల్ల యాదగిరి, కాంగ్రెస్ నాయకులు పంగ ఐలయ్య, కున్సోత్ లక్ష్మణ్, మూడ జగురామ్, పంగ వెంకన్న, కాసర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి భూపాలపల్లిలో ఐటీడీఏ ఏర్పాటే పరిష్కారం

- నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలి
- నాయకపోడ్ తెగకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి




**ప్రజా వాయిస్, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్ ఏరియా జాబితాలో చేర్చాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. నాయకపోడ్ ఉపతెగకు ప్రత్యేక నంబర్ కేటాయించి, గెజిట్ నోటిఫికేషన్ ద్వారా గుర్తించి అత్యంత వెనుకబడిన తెగల (PVTG) జాబితాలో చేర్చాలని కోరారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్లో సంఘం జిల్లా కమిటీ సమావేశం మేకల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ జిల్లాలో ఆదివాసీలు అధికంగా ఉన్నప్పటికీ ఐటీడీఏ లేక అభివృద్ధికి దూరమవుతున్నారని అన్నారు. ఆదివాసీలు అధికంగా నివసించే గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని కోరారు.నాయకపోడ్ భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలకు పంట రుణాలు అందించాలని, ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలం రాజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# రైతులకు 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ

- రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- కదిరి లేపాక్షి-1812 రకం విత్తనాల పంపిణీ
- వర్గల్ మండలానికి 40 క్వింటాళ్ల విత్తనాలు
- 50 ఎకరాలకు అందనున్న సబ్సిడీ విత్తనాలు
- వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్

**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా /** గజ్వేల్ నియోజకవర్గం :రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందిస్తున్నట్లు వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్ తెలిపారు. మంగళ వారం వర్గల్ మండలం అంబర్‌పేటలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించేందుకు ప్రభుత్వం వివిధ రాయితీ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. 100 శాతం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ములుగు వ్యవసాయ సహాయ సంచాలకుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. వర్గల్ మండల పరిధిలో వేరుశనగ సాగు చేసే రైతులు సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూనెగింజల పథకం కింద కదిరి లేపాక్షి-1812 రకం వేరుశనగ విత్తనాలను రైతులకు 100 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. వర్గల్ మండలానికి 40 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించామని, వీటిని సుమారు 50 ఎకరాల విస్తీర్ణానికి సరిపడేలా రైతులకు అందించనున్నట్లు అనిల్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, సర్పంచులు వెంకటేష్, కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ మోహన్, ఆత్మ డైరెక్టర్ రెహమాన్, నాయకులు సదానందరెడ్డి, నీల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సాగు భారం పెరిగింది...- దిగుబడి తగ్గింది

- తీవ్రంగా నష్టపోతున్న పత్తి రైతులు
- పత్తి తీస్తున్న ప్రారంభం కానీ కొనుగోలు కేంద్రాలు
- అయోమయంలో రైతులు



**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** తెలంగాణ వ్యాప్తంగా లెనినో ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏ పంట చూసినా దిగుబడిలో మాత్రం ఆశించిన స్థాయిలో వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదు. ఉదాహరణకు పత్తి పంటను తీసుకుంటే గత రెండేళ్ల క్రితం ఎకరాకు 14 క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడి వచ్చేది. గత ఏడాది అత్యధిక వర్షాలు కురవడంతో సంగారెడ్డి జిల్లాలో మంజీరా పరివాహక ప్రాంతం తో పాటు వర్ష ప్రభావంతో నీట మునిగి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. ఈసారైనా సమృద్ధిగా వర్షాలు పడతాయి... పోయినసారి కంటే దిగుబడి వస్తుందన్న ఉద్దేశంతో తెలంగాణలోనే అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో మూడు లక్షల 25 వేల ఎకరాలలో పత్తి పంట సాగు చేస్తున్నారు. కానీ ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు లేని కారణంగా ఎకరాకు సగటున కనీసం నాలుగు క్వింటాళ్ల పత్తి దిగుబడి కూడా కావడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరా పత్తి పంట సాగు చేయాలంటే సగటున 26 వేల పెట్టుబడి అవసరం ఉంటుంది. కానీ నాలుగు క్వింటాళ్ల పత్తి దిగుబడి అయితే 8500కు మద్దతు ధర ఇచ్చిన కేవలం 34 వేల ఐదు వందలు మాత్రమే వస్తున్నాయి. అంటే పెట్టిన పెట్టుబడి మీద 10,000 మాత్రమే అదనంగా వచ్చిన రైతులకు మాత్రం ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదని చెప్పవచ్చు. కౌలు రైతుల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. ఎకరాకు పదిహేను వేల చొప్పున కౌలు కట్టి పత్తి పంట సాగు చేస్తే లాభం సంగతి దేవుడెరుగు సగటున ఎనిమిది వేల వరకు నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం సకాలంలో వర్షాలు కురవకపోవడమే అనేది స్పష్టంగా అర్థమవు తుంది. వర్షాలు కురియుని కారణంగా పత్తి దంటు పెరగకపో వడం.. పెరిగిన దంటుకు కాత కూడా లేనీ కారణంగా దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదనేది అర్థమవుతుంది. ఎకరానికి 26వేల పెట్టుబడి కేవలం విత్తనాలు వేసి రసాయన ఎరువులు పురుగుల మందులు స్ప్రే చేయడం వరకు మాత్రమే. పత్తి తీసేందుకు మరో మూడు నుంచి ఐదు వేల వరకు ఖర్చు అవు తుందనేది రైతులు తెలిపారు.

### తీవ్రంగా నష్టపోయాం : రైతు కుమ్మరి పెంటయ్య..

తన సొంతభూమితో పాటు కౌలుకు నాలుగు ఎకరాలు పట్టుకున్న. ఎకరాకు 14000 చొప్పున కౌలు కట్టాను. సుమారు 28 వేల వరకు మసాలా, కలుపు తీయడం ,మందుల కోసం ఖర్చు పెట్టాను. కానీ కనీసం నాలుగు క్వింటాళ్లు కూడా దిగుబడి రావడం లేదు ఎకరాకు. దీంతో కౌలు పైసలతో పాటు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కౌలు రైతులం తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం నష్టపోయిన పంటలను గుర్తించి ఎంత కొంత ఆర్థిక సాయం చేస్తే బాగుంటుంది.

### ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు..

జిల్లావ్యాప్తంగా పత్తి తీయడం ప్రారంభించారు రైతులు. కానీ ఎక్కడ కూడా తీసిన పత్తిని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను మాత్రం ప్రభుత్వం అధికారికంగా, ప్రైవేట్ వ్యక్తులు కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏ సమయంలో వర్షం పడితే చేతికందిన పంట నీటిపాలవుతుందన్న భయాందోళనలతో పత్తిని తీయడం ప్రారం భించారు. ఇప్పటికే దిగుబడి తగ్గడంతో అసలుకి నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతుంటే కొనుగోలు కేంద్రాలు లేని కారణంగా తీసిన పత్తిని ఇంట్లో నిలువ చేసుకొని మరింత నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే రోజుకింత బరువు తగ్గి మరింత నష్టపోయే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**శ్రీరంగాపూర్ అక్టోబర్ 6 ప్రజా వాయి** స్మండల పరిధిలోని తాటిపాముల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కటిక భారతమ్మ (70) 2021 సంవత్సరంలో వికలాంగుల పింఛన్ కోల్పోయింది. ఆమె ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పింఛన్ రాకపోవడంతో మనోవేదన గురైంది... ఇటీవలే పక్షవాతం నుంచి కోలుకుంది. ఈనెల 5న జిల్లా అధికారులను కలిసి అమ్మకు పింఛన్ ఇప్పించండి సార్ అని జిల్లా ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకున్నారు. 10 సంవత్సరాల క్రితంమే భర్త చనిపోయారు. ఇప్పటికే ఉన్న పాత ఇల్లు కూలిపోయి ఉంది. ఆమె కుమారుడు ప్రసాద్ పెబ్బేరు మటన్ షాప్ లో పనిచేస్తూ అమ్మని పోషిస్తు న్నారు. ఆమె పరిస్థితి తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు కిష్టారెడ్డి స్పందించి ఆమె కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీవనోపాధిని కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య నాయుడు, రంజిత్, శ్రీను, గోవర్ధన్ తదిత రులు పాల్గొన్నారు.

# శ్రీరంగాపూర్ మండలంలో ఘనంగా 'అంగన్‌వాడీ సేవా మిలన్'

**శ్రీరంగాపూర్ అక్టోబర్ 6 ప్రజా వాయిస్** మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, సేరుపల్లి, మరియు కంబాలపూర్ గ్రామాల్లో 'అంగన్‌వాడీ సేవా మిలన్' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. సమాజానికి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ ప్రత్యేక కార్యక్ర మాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమం బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కవిత, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్వేతకేతన్ యాదవ్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా వారు అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల బిజెపి అధ్యక్షుడు నలపోతుల విష్ణువర్ధన్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రాజ శేఖర్, జిల్లా యువమోర్చా నాయకులు రాజేష్, జిల్లా



ఓబీసీ కార్యదర్శి సిట్టి రాజుల శివ, మండల కోశాధికారి లక్ష్మీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు కోమారి రాముడు, మాజీ ఐటీ సెల్ కన్వీనర్ గుంటి శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పాత కక్షలతో యువకుడిపై హత్యాయత్నం

- బీరు సీసాతో తలపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు
- తీవ్రంగా గాయపడిన తాండ్రియాల గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్
- ఘటనకు పాల్పడిన సొరపాక నవీన్, కారం రాజు అరెస్ట్, రిమాండ్
- మద్యం మత్తులో ఫోన్ చేసి పిలిపించి దాడికి తెగబడిన నిందితులు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు:
- ఎస్సై రవికిరణ్ హెచ్చరిక

**ప్రజా వాయిస్, కథలాపూర్:**పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై ఇద్దరు వ్యక్తులు బీరు సీసాతో తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం... తాండ్రియాల గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ (తండ్రి: షేక్ ఇమామ్) అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన సొరపాక నవీన్ (తండ్రి: నర్సయ్య), కారం రాజు (తండ్రి: శంకర్) పాత కక్షలను మనసులో ఉంచుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ (సోమవారం) రాత్రి సుమారు 9:00 గంటల సమయంలో తాండ్రియాల గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద నిందితులిద్దరూ మద్యం సేవిస్తూ, షేక్ ఇమ్రాన్‌కు ఫోన్ చేసి అక్కడికి రావాలని పిలిచారు. ఇమ్రాన్ అక్కడకు చేరుకోగానే, అతనిని చంపాలనే దురుద్దేశంతో నిందితులు బీరు సీసాతో తలపై బలంగా కొట్టారు. ఈ దాడిలో ఇమ్రాన్ తలకు తీవ్ర రక్తగాయం కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా దాడికి పాల్పడిన సూరపాక నవీన్, కారం రాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై రవికిరణ్ మాట్లాడుతూ... మండలంలో ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజాశాంతికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.






# పంటలు ఎండుతుంటే పరాచకాలా

- చౌరస్తాలో తొడలు కొట్టడం కాదు సీఎంతో మాట్లాడి పంటల బీమా తీసుకురా
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సవాల్
- 10 రోజుల్లో విద్యుత్ సమస్యను తీర్చకపోతే సబ్ స్టేషన్ల ముట్టడికి హెచ్చరిక

**(ప్రజా వాయిస్ షాద్‌నగర్)** షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడెం గ్రామంలో విద్యుత్ సమస్యతో పంటలు కళ్లముందే ఎండిపోతుండటం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. విద్యుత్ కోతలు, తరచూ కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల నీరందక ఎండిపోతున్న పొలాలను మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు. షాద్‌నగర్ చౌరస్తాలో రాజకీయంగా తొడలు కొట్టడం కాదు పంటలు ఎండిపోయి కన్నీళ్లు పెట్టుకుంటున్న రైతులకు పంటల బీమా నష్టపరిహారం ఎందుకు ఇవ్వడం లేదో సీఎం రేవంత్ రెడ్డి దగ్గర తొడలు కొట్టి అడగాలి అని సవాల్ విసిరారు పదేపదే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపో వడం వల్ల గ్రామంలో సుమారు 20 ఎకరాల పంటలు నీరందక ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు రైతుల కష్టాలు అధికారులకు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు చింతగూడెంలో నిరంతర విద్యుత్ సరఫరా పునరుద్ధరించి ట్రాన్స్‌ఫార్మర్ల భారాన్ని తగ్గించేలా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు వారం నుండి 10 రోజుల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించకపోతే రైతులతో కలిసి విద్యుత్ ఉపకేంద్రం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఈసునాతి శ్రీనివాస్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, పసుల నర్సింహ యాదవ్, కంచుకోట మహేష్, పలువురు మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



# సేవకు మరో అడుగు..ఆత్మీయతకు మరో నిదర్శనం

- దసరా, బతుకమ్మ సందర్భంగా నూతన వస్త్రాల పంపిణీ
- పారిశుద్ధ్య కార్మికులను గౌరవించిన మాజీ సర్పంచ్
- గతంలో వైకుంఠ వాహనం అందుబాటులోకి తెచ్చిన గోపాల్ రెడ్డి
- సొంత నిధులతో సేవా కార్యక్రమాల నిర్వహణ
- వర్గల్ మాజీ సర్పంచ్ తూంకుంట గోపాల్ రెడ్డి

ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా / గజ్వేల్ నియోజకవర్గం :దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బందిని గౌరవిస్తూ వర్గల్ మాజీ సర్పంచ్ తూంకుంట గోపాల్‌రెడ్డి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మంగళవారం వర్గల్ పంచాయతీలో నిర్వహించిన కార్యక మంలో పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు అందజేసి వారిపై తనకున్న ఆత్మీయతను చాటుకు న్నారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం తన బాధ్యతగా భావిస్తాన్నారు. పండుగ వేళ ప్రతి ఒక్కరూ సంతోషంగా గడపాలన్న ఉద్దేశంతో తనవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసం పనిచేసే ప్రతి ఒక్కరి కష్టాన్ని గుర్తించి గౌరవించడంలోనే నిజమైన సంతృప్తి, ఆనందం లభిస్తాయని అన్నారు. వర్గల్ ప్రజలకు అవసర మైన సేవలను అందించాలనే ఉద్దేశంతో గతంలో సొంత నిధులతో వైకుంఠ వాహనాన్ని అందు బాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలకు తనవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఆపదలో ఉన్నవారికి, సమాజానికి సేవ చేసే వారికి అండగా నిలవడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# ఆర్ టి సి విలీనం ఎంప్లాయిస్ యూనియన్ తోనే సాధ్యం

- ఆర్ టి సి ఎన్నికల్లో కార్మికులు బస్ గుర్తు, నిచ్చెన గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గీలిపించండి
- ఏఐటీయూసీ నగర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం,శనిగరపు చంద్ర శేఖర్ లు కార్మిక వర్గానికి పిలుపు




**ప్రజా వాయిస్ గోదావరిఖని** ఆర్ టి సి డిపో ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు ఎంప్లాయిస్ యూనియన్ ఎన్ఎంయు టి యమ్ యు ల ఐక్య కూటమి ఎన్నికల గెట్ మీటింగ్ జరిగింది. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చాతర్ల బాబు, గుడికందుల శ్రీనివాస్, టిఎంయు నాయకులు వంగర శ్రీనివాస్ టి ఆర్ రెడ్డి, ఎన్ ఎం యు నాయకులు మాతంగి తిరుపతి గార్ల తో కలిసి గెట్ మీటింగ్ లో మాట్లడుతూ ఆర్ టి సి విలీనం,కార్మిక హక్కులు ఎంప్లాయిస్ యూనియన్ తోనే సాధ్యమని ఏఐటీయూసీ రామగుండం నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం,శనిగరపు చంద్రశేఖర్ లు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

గోదావరిఖని డిపోలో ఎంప్లాయిస్ యూనియన్(AITUC) ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలన ఆర్ టి సి నష్టాల్లోకి వెళ్లిందని వారు అన్నారు,ఎన్నికల్లో ఆర్ టి సి కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించి,ప్రభుత్వం లో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలు గా కార్మికులను అన్ని విధాలుగా మోసం చేసిందని వారు గుర్తు చేసారు. ఐ ఎన్ టి యు సి ఈ ఎన్నికల్లో నిలబడికార్మికులను ఓటు అడిగే నైతిక హక్కు లేదని వారు హితువు పలికారు.ఇప్పటికైనా ఆర్ టి సి కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు,ఆర్ టి సి కార్మిక హక్కులు ఎంప్లాయిస్ యూనియన్ ఐక్య కూటమి తోనే సాధ్యమని వారు అన్నారు. ఆర్ టి సి ని ప్రభుత్వంలో విలీనం,కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని,అధి కారుల వేధింపులు తగ్గిస్తామని,పిఆర్సి డబ్బులు పెండింగ్లో ఉన్న ,CCS డబ్బులు ఇప్పిస్తామని కార్మికుల హక్కులు పోరాడి శాదిస్తామని వారు కార్మిక వర్గానికి హామీ ఇచ్చారు. బ్రెడ్ విన్నెర్స్ స్కీం కింద ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ దే అని వారు గుర్తు చేసారు. గోదావరిఖని డిపోలో కార్మికుల సమస్యలు పరిష్కారం చేసిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ దేనని, ఈ ఎన్నికలలో కార్మికులు బస్ గుర్తు, నిచ్చెన గుర్తుకు, ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. 2025 కు సంబంధించి మెరుగైన వేతన సవరణ చేస్తామని,గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం.ఆర్టీసీ సంస్థ పరి రక్షణ కోసం ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తాం,డ్రైవర్, కండక్టర్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని,CCS డబ్బులు ఇప్పిస్తామని, ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కోసం ఆర్టీసీ కార్మికుల సమస్యలను ఎప్పటిక ప్పుడు యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు గారితో అసెంబ్లీలో కూడా పోట్లాడి ప్రభుత్వ మెడలు వంచన పంచైన సత్వరమే పరిష్కరించే బాధ్యత ఏఐటీ యూసీ దేనాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ మసూద్ ఈ శ్రీనివాస్ ఎస్ ఎన్ చారి డి వెంకటేష్ పి ఆంజనేయులు ఎస్ రాములు సంపత్ డాక్టర్ గొడిసెల నంబయ్య, ఈదునూరి రమేష్ కోడి రాకేష్ బాబు బేతి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ కసరత్తు

**- ఎన్నికల ఎన్రోల్మెంట్, సేవా జ్యోతి సంకల్ప అభియాన్‌పై అవగాహన**

**ప్రజావాయిస్/వికారాబాద్, కోటపల్లి:**

భారతీయ జనతా పార్టీ కోటపల్లి మండల కేంద్రంలో ఉమ్మడి హైదరాబాద్–రంగారెడ్డి––మహబూబ్‌నగర్ జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం, సేవా జ్యోతి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు రాచ శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు (ఎన్రోల్మెంట్) ప్రక్రియతో పాటు సేవా జ్యోతి సంకల్ప అభియాన్‌పై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

**మండల ప్రధాన కార్యదర్శులుగా బాల్ రాజ్, అభిలాష్ రెడ్డి నియామకం**

జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ అనుమతితో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శులుగా బాల్‌రాజ్, అభిలాష్ రెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా నియమితులైన ప్రధాన కార్యదర్శులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, అశోక్, మల్లేశం, వెంకట్ రెడ్డి, రమేష్, సాయి, రవి, నర్సింలు, నవీన్ తదితరులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీఐ సమాచారంపై కమిషనర్ ఆదేశాలు

**ప్రజా వాయిస్ మంథని**



మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన ఎల్క సదానందం మీ–సేవా కేంద్రాల తనిఖీలకు సంబంధించి సూచించిన అంశాలపై సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా కలెక్టరేట్‌లో సమాచారం కోరారు. అయితే నిర్ణీత సమయంలో సమాచారం అందకపోవడంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర సమాచార కమిషనర్ ఈ నెల 1న కమిషన్ ఎదుట హాజరు కావాలని ఈడీఎం సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో సదానందం మంగళవారం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీఎం సూపరింటెండెంట్ కూడా హాజరై, కోరిన సమాచారాన్ని మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో అందజేస్తామని కమిషనర్‌ను కోరారు. దీనికి కమిషనర్ మూడు రోజుల గడువు మంజూరు చేస్తూ, దరఖాస్తుదారుడికి పూర్తి సమాచారం అందించాలని ఆదేశించారు. ఇప్పటికైనా తన ఆర్టీఐ దరఖాస్తుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారులు అందిస్తారనే ఆశాభావాన్ని సదానందం వ్యక్తం చేశారు.




## చిన్నారులకు అండగా బీజేపీ నాయకులు

### అంగన్ మిలన్ సేవా సంకల్ప్ అభియాన్

### అంగన్‌వాడీ కేంద్రంలో సేవా కార్యక్రమాలు

**ప్రజావాయిస్/మోమిన్ పేట్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న అంగన్ మిలన్ సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మోమిన్‌పేట్ మండలం మొరంగపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ఘనంగా సన్మానించి, చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.అలాగే మొరంగపల్లి బీజేపీ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్ చిన్నారులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు అంగన్‌వాడీ కేంద్రానికి కార్పెట్‌ను విరాళంగా అందజేశారు. చిన్నారుల సంక్షేమం కోసం చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణ బిచ్చయ్య, సీనియర్ నాయకులు బంతి మల్లేశం, పెద్దగొల్ల లక్ష్మయ్య, రాజేష్, వెంకటేష్, హరికృష్ణతో పాటు బీజేపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమిని

# అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

**మోసపోతే గోసపడతాం: ఇవి చరిత్రాత్మక ఎన్నికలు**

**డిపో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లకు నేరుగా కరపత్రాల పంపిణీ**

**పిఆర్‌సి, పదోన్నతులు, ఉద్యోగ భద్రతే ధ్యేయంగా నిరంతర పోరాటం**

**మెట్‌పల్లి డిపోలో విస్తృత ప్రచారం చేసిన ఏఐటీయూసీ నాయకులు**


**ఏశమేని గణేష్, ఎం.డి. ముక్రమ్**

**ప్రజా వాయిస్, మెట్‌పల్లి**

ఈ నెల 9న జరగనున్న టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ, టీఎంయూ, ఎన్ఎంయూల జేఏసీ ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముక్రమ్ పిలుపునిచ్చారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా మెట్‌పల్లి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో డిపో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందిని నేరుగా కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... “మోసపోతే గోసపడతాం” అని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, పదోన్నతులు మరియు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఐక్య కూటమి నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు. గతంలో కార్మిక హక్కుల సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలను వివరిస్తూ, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో యాజమాన్యం, ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన న్యాయమైన హక్కులను సాధించుకోవడానికి ఐక్య కూటమికి మద్దతు ఇవ్వడం చారిత్రక అవసరమన్నారు. కార్మికుల క్షేమమే ధ్యేయంగా



పనిచేస్తున్న ఈయూ–టీఎంయూ–ఎన్ఎంయూ జేఏసీ ఐక్య కూటమి ‘బస్సు’, ‘నిచ్చెన’ గుర్తులపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిపో యూనియన్ అధ్యక్షుడు మురళీధర్, సెక్రటరీ రాములు, నాయకులు ప్రవీణ్, ఎం.పి. రెడ్డి, ఏఐటీయూసీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



## సౌమ్య అత్యవసర వైద్య చికిత్సకు రూ.2 లక్షల ఎల్ఓసీ (లెటర్ అఫ్ క్రెడిట్) మంజూరు

**ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి చేతుల మీదుగా ఎల్ఓసీ అందజేత**

**పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సహాయం అందేలా కృషి**

**ఆర్థిక ఇబ్బందులతో వైద్యం ఆగకూడదు: ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి**

**ప్రజా వాయిస్/పాలకుర్తి/అక్టోబర్ 06**

పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దవంగర మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన సౌమ్య కి అనారోగ్య రీత్యా అత్యవసర చికిత్స నిమిత్తం రూ.2 లక్షల రూపాయలు లెటర్ అఫ్ క్రెడిట్ మంజూరు చేయించి, ఈరోజు అందజేసిన పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్వినీ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని, సౌమ్య త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



## అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లకు ఘన సన్మానం

**బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ‘అంగన్ మిలన్ సేవ’**

**మోటకొండూరు, అక్టోబర్ 6 (ప్రజా వాయిస్ ):-**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో మైలురాళ్లను పురస్కరించుకుని చేపట్టిన ‘సేవా సంకల్ప అభియాన్’లో భాగంగా మండలంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ‘అంగన్ మిలన్ సేవ’ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మోటకొండూరు మండలములోని చాడ, ముత్తిరెడ్డిగూడెం తో పాటు మండలంలో పలు అంగన్వాడి కేంద్రాల్లో సమాజ ఆరోగ్య పరిరక్షణ, చిన్నారుల ఎదుగుదలకు అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయాలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. నిరంతరం శ్రమిస్తున్న వారి సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి తోటకూరి మహాలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు జోరుక ఎల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి మల్ల అశోక్, నాయకులు గుర్రాల కోటేష్, పైల్ల వెంకటరెడ్డి, గుర్రాల కుమార్, భువనగిరి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సాఫ్ట్‌బాల్ లో రాష్ట్రస్థాయికి గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు

**గాయత్రీ విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్**

**ప్రజా వాయిస్, పెద్దపల్లి :**

గోదావరిఖనిలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–13 సాఫ్ట్‌బాల్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 16న హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా గాయత్రీ విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీదేవి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజేందర్, పీఈటీలు అజయ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ రిజర్వేషన్ల భయంతోనే వైసీపీ కోర్టులకు వెళుతోంది

**: మంత్రి మండిపల్లి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే భయంతోనే వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రజల్లోకి వెళ్లి పనిచేసే సత్తా వైసీపీకి లేదని, ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ఆరోపణలు చేయడం, కేసులు వేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని మంత్రి విమర్శించారు. బీసీల సంక్షేమం, వారి రాజకీయ సాధికారతపై వైసీపీకి ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు, రాజ్యాంగ హక్కులకు అనుగుణంగానే తమ కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి అందాయని, ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మండిపల్లి వివరించారు. గృహ నిర్మాణం, ఉద్యానవన రంగాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీలు పూర్తి సన్నద్ధంగా ఉన్నాయని, ప్రజల మద్దతుతో వార్డు స్థాయి నుంచి మేయర్ పదవి వరకు నిర్ణయాత్మక విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు ఉదయ్ కిరణ్ ఎంపిక

### నిరంతర సాధన, చెక్కుచెదరని పట్టుదల

### క్రీడా ప్రముఖుల, క్రీడాభిమానుల అభినందనలు

### ఉన్నత స్థాయిలో రాణించాలని పలువురి ఆకాంక్ష



**ప్రజా వాయిస్/ఆత్మకూరు (ఎం):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం సర్వేపల్లి గ్రామానికి చెందిన సుంకిశాల ఉదయ్ కిరణ్ వాలీబాల్‌లో తనదైన శైలిలో రాణిస్తూ ప్రతిభను చాటి ప్రతిష్టాత్మక సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఉదయ్ కిరణ్, సౌత్ జోన్ జట్టుకు ఎంపిక కావడం ఇది వరుసగా రెండోసారి కావడం విశేషం.నిరంతర సాధన, కఠోర శ్రమ, చెక్కుచెదరని పట్టుదలతో వాలీబాల్ క్రీడలో రానిస్తూ మరోసారి సౌత్ జోన్ స్థాయికి ఎంపిక కావడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు,స్నేహితులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్‌కు పలువురు క్రీడా ప్రముఖులు, క్రీడాభిమానులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఆయన సాధించిన ఈవిజయం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని విజయాలు సాధించి, ఉన్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.



### విమర్శలను పట్టించుకోను...

# గ్రామ అభివృద్ధే నా లక్ష్యం

### అల్లందేవిచెరువులో విద్యుత్ కష్టాలకు శాశ్వత పరిష్కారం

### ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం**
గ్రామంలో ఎదురవుతున్న ప్రమాదకర విద్యుత్ సమస్యలకు శాశ్వత ముగింపు పలుకుతూ యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని అల్లందేవి గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చారు.?గ్రామంలోని గుండు లింగస్వామి ఇంటి వద్ద ఉన్న రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, పాతబడిన లైన్ల కారణంగా వర్షాకాలంలో తీవ్ర ప్రమాదాలు పొంచి ఉండేవి. గాలులకు వైర్లు తెగిపడి ప్రజలు, పశువులు భయాందోళనకు గురయ్యేవారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్, వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించడమే కాకుండా అదనంగా మరో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు.మంగళవారం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మొత్తం 3 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులను సర్పంచ్ దగ్గరుండి ప్రారంభించారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు.?ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,విమర్శలను పట్టించుకోను గ్రామాభివృద్ధే నా సింగిల్ ఎజెండా అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముఖ్యర్ల కవితా స్వామి యాదవ్, వార్డు సభ్యుడు గుండు లింగస్వామి గౌడ్, జీపీ సిబ్బంది నాగేష్, గాలయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



### సేవా జ్యోతి బైక్ ర్యాలీ

# విజయవంతం చేయాలి:

### బిజెపి మండల అధ్యక్షుడు కాశీనాథ్

**ప్రజా వాయిస్/ఆత్మకూరు (ఎం):**
భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల కేంద్రంలో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు కాశీనాథ్ మాట్లాడుతూ సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా భువనగిరిలో అక్టోబర్ 7న నిర్వహించే సేవా జ్యోతి బైక్ ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కోరే లక్ష్మణ్ ,మండల ఉపాధ్యక్షులు రాంబాబు,సాయి రెడ్డి చంద్రారెడ్డి,బిజెపి జిల్లా నాయకులు బండారు సత్యనారాయణ,లోడి వెంకటయ్య.యాస వెంకట్ రెడ్డి బీజేవైఎం నాయకులు భాష బోయిన లింగయ్య యాదవ్, బొజ్జ పవన్,పొనగాని సూర్య, బండారు సాయి తదితరులు పాల్గొన్నారు.



# షాబాద్ లో గంజాయి పట్టివేత

### 57 గ్రాముల గంజాయి స్వాధీనం పోలీసులు అదుపులో నిందితులు

**ప్రజా వాయిస్ షాబాద్)**
షాబాద్ మండల పరిధిలో గంజాయి అక్రమ రవాణా వినియోగంపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు ఇందులో భాగంగా మాచన్‌పల్లి గ్రామ శివారులో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు ఈ తనిఖీల్లో 57 గ్రాముల గంజాయి పట్టుబడగా ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే షాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాని కుమార్ గోండ్ (21) తండ్రి ప్రేమ్ సింగ్ గోండ్, దీబెంద్ర విశ్వకర్మ (21) రామ్ చరణ్ విశ్వకర్మ, సంజయ్ కుమార్ కశ్యప్ (17) తండ్రి సత్యనారాయణ గంజాయితో పట్టుబడ్డారు. వీరి వద్ద లభించిన 57 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని చట్టపరమైన నిబంధనల మేరకు కేసు చేశారు. విచారణలో నిందితులు చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని ప్రస్తుతం షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు గంజాయి ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరెవరికి కొన్నుగోలు చేశారు, ఇతరులకు సరఫరా చేస్తున్నారా అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై అక్టోబర్ 5న ఎన్‌డీపీఎస్ చట్టం-1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు స్పెషల్ హౌస్ ఆఫీసర్ లక్ష్మీ రెడ్డి తెలిపారు. గంజాయి సరఫరా వెనుక ఉన్న వ్యక్తుల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ప్రేమికుడి కోసం రెండవ రోజు కొనసాగుతున్న యువతి మౌన పోరాటం..

### దళిత యువతిని మోసం చేసిన మున్సిపల్ చైర్మన్ కొడుకు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..

### న్యాయం జరిగే వరకు యువతికి అండగా ఉంటాం అన్న తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య



**ప్రజా వాయిస్ వరంగల్ (వర్ధన్నపేట):**
వర్ధన్నపేట పట్టణానికి చెందిన దళిత యువతి నీ ప్రేమ పేరుతో మోసం చేసిన వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ కుమారుడి పై చట్టపరమైన చర్యలు ప్రభుత్వ అధికారులు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య విజ్ఞప్తి చేశారు.వర్ధన్నపేటలో సారంగపాణి ఇంటి ముందు తన కుమారుడి చేతిలో మోసపోయిన యువతి రెండో రోజు దీక్ష చేపట్టగా తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆ యువతికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.. వర్ధన్నపేట శాసనసభ్యుడు కూడా దళిత వర్గానికి చెందిన వ్యక్తి కనుక మున్సిపల్ చైర్మన్ కూడా అధికార పార్టీ చెందిన వ్యక్తి కావడం తో ఎమ్మెల్యే చొరవ తీసుకొని దళిత యువతి నీ చైర్మన్ కుమారుడు వివాహం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు . ఈ సమావేశంలో మాస్ రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు,అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా ఇన్చార్జి తాటికాయల వివేకనంద ,వరంగల్ జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్లతో పాటు వర్ధన్నపేట పట్టణానికి చెందిన పలువురు మహిళలు పలు సంఘాల నాయకులు కూడా పాల్గొని సంఘీభావం ప్రకటించారు.






# పలిమెల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

### పలిమెల పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ

### పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

### శాంతిభద్రతల పరిరక్షణపై సిబ్బందికి దిశానిర్దేశం

**ప్రజావాయిస్, పలిమెల:**
వార్షిక ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా కాటారం సబ్ డివిజన్ డీఎస్పీ ఏ. సూర్యనారాయణ మంగళవారం పలిమెల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులను పరిశీలించారు. సిబ్బంది కిట్ బాక్సులు, విధి నిర్వహణ సామగ్రిని తనిఖీ చేసి వాటిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణకు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ వారితో సమన్వయంతో విధులు నిర్వహించాలని డీఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అప్రమత్తత, బాధ్యతాయుత వైఖరిని పాటించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మహాదేవపూర్ సీఐ ఎన్. వెంకటేశ్వర్లు, పలిమెల ఎస్ఐ సాయి శశాంక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# సింగతి చిన్న మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి బోడ జనార్ధన్

**ప్రజా వాయిస్.బెల్లంపల్లి రూరల్.**
బెల్లంపల్లి మండలం బట్వానపల్లి గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ సింగతి చిన్న మల్లయ్య ఇటివలే అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ మంత్రి బోడ జనార్ధన్ మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న మల్లయ్య మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాకం కొమురయ్య, బొలిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# నాగసానిపల్లిలో భూముల ఆ-సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

### సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలి

### భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు తావు లేకుండా రీ సర్వే పనులను పూర్తి చేయాలి

**శ్రీరంగాపూర్ అక్టోబర్ 06: ప్రజా వాయిస్**
శ్రీరంగాపూర్ మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని వ్యవసాయ భూముల్లో సర్వే సిబ్బంది రోవర్ పరికరాల ద్వారా నిర్వహిస్తున్న కొలతలను, హద్దుల గుర్తింపు ప్రక్రియను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా మరియు ఖచ్చితత్వంతో రీ-సర్వే పనులను పూర్తి చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు. డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించి, రికార్డుల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు సైతం తమ భూముల హద్దుల గుర్తింపు సమయంలో సర్వే సిబ్బందికి సహకరించి, పనులను సకాలంలో పూర్తి చేసేలా పాలుపంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో చెన్నయ్య, రాజశేఖర్ యాదవ్, గ్రామ రెవెన్యూ ఆఫీసర్ రాములు,స్థానిక రైతులు , తదితరులు పాల్గొన్నారు.



# పత్తి సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన

**ప్రజావాయిస్/మోమిన్ పేట్**
వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం రామ్‌నాథ్ గుడుపల్లి గ్రామంలో పత్తి పొలంలో క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ రెడ్డి పాల్గొని రైతులకు పత్తి సాగులో ఆధునిక పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం), చీడపీడల నియంత్రణ, పంట మార్పిడి, మిత్ర పురుగుల ప్రయోజనాలు, పురుగుమందుల వినియోగంపై అవగాహన కల్పించారు.ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ స్వాతి, సర్పంచ్ కొత్త బస్వేశ్వర్, ఉపసర్పంచ్ రమేష్‌తో పాటు శరణయ్య, బల్వంత్ రెడ్డి, అనిల్, రవి తదితర రైతులు పాల్గొన్నారు.

# భారతదేశంలో "ఎల్'నినో" పరిస్థితి చాలా ఘోరంగా ఉంది

**ఈ సంవత్సరము,, వచ్చే సంవత్సరము"**
**కాలము , కాదని శాస్త్రవేత్తలు ముందే చెప్పారు**

పంటలు వర్షాభావం లేక పండవని కరువు పరిస్థితి ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు మనకు తెలియపరిచిన సంగతి మీ అందరికి తెలిసిందే(ఆల్రెడీ కొంత మేరకు తెలుసు కాబట్టి గుర్తు చేయడం కోసమే ఈ వార్తను ప్రజా వాయిస్ నుంచి పెడుతున్నాము.)ఖర్చులు చాలా తగ్గించుకోవాలనే తెలియపరుస్తున్నాము. ఎట్టి పరిస్థితిలోనూ కోటా బియ్యము ( రేషన్ రైస్) ప్రతినెల భద్రపరుచుకోవాల్సిందిగా తెలియజేస్తున్నాము చిరుధాన్యాలు నిల్వ చేసుకోండి .అవసరం లేకుండా బట్టలు కొనుక్కోవడం .ప్రతి దానికి చిన్న చిన్న ఫంక్షన్లు ఇంట్లో చేయడం ఇంట్లో చిన్న చిన్న దేవతలు పెట్టుకొని ఊరంతా పిలిచి భోజనాలు పెట్టడం,,వెళ్లే ఫంక్షన్లకు ఖరీదైన గిఫ్టు ఇవ్వడం చేయకండి.ప్రతి చిన్న విషయానికి కుటుంబ సభ్యులకు " దావతు " ఇవ్వడం.పది నుంచి 15 వేల రూపాయల లోపు అత్యవసర పరిస్థితిలో మాత్రమే అప్పు చేయగలరు.ప్లాట్స్ కొనుగోలు చేయడం అలాగే ఖాళీగా ఉన్న స్థలాలకు చుట్టూ ప్రహరీ గోడలు కట్టడం లాంటివి ప్రస్తుతానికి చేయకూడదు. ఇంటికి కొత్త రంగులు వేయడం ప్రస్తుతానికి వాయిదా వెయ్యండి.టూ వీలర్ ఉంటే చాలా జాగ్రత్తగా వాడుకోండి. పెట్రోల్ రేట్లు కూడా బాగా పెరుగబోతున్నాయి. అలాగే ప్రతి అనవసరమైన విషయానికి బండి వాడవద్దు. నడకను మొదలు పెట్టండి. లేదా సైకిల్ మీద వెళ్లే ప్రయత్నం చేయండి.మన వాడే. కదా అని సూరిటీలు సంతకం పెట్టమాకండి.ఇలా ఎన్నో విషయాలలో ఖర్చులు తగ్గించుకోవాల్సిందిగా ప్రజా వాయిస్ నుంచి తెలియజేస్తున్నాము.ఇట్టి విషయంలో కొంత తెలిసిన గుర్తు చేయటం కోసము ప్రజా వాయిస్ నుంచి తెలియపరుస్తున్నాము ఎండలు విపరీతంగా ఉంటాయి. ఈ సంవత్సరం చలికాలం కూడా అంతగా ఉండదని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలియ పరుస్తున్నారు.అలాగే కరెంటు విషయంలో కూడా చాలా జాగ్రత్తగా వాడుకోవాలి. కరెంటు కోతలు ఎక్కువగా ఉండ బోతున్నాయి. ఉక్కపోతతో కూడిన ఎండలు ఎక్కువగా ఉంటాయి.వాటర్ ఎక్కువగా తాగుతూ ఉండాలి. ఆరోగ్యం పై ఎక్కువగా శ్రద్ధ చూపించండి. పరిసర ప్రాంతాల్లో నడకను చేయండి. ఉదయం యోగా, ఎక్సర్సైజ్, ప్రాణాయములు తప్పనిసరిగా చెయ్యాలి.2027 డిసెంబర్ వరకు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని శాస్త్రవేత్తలు ముందుగానే అందరికి తెలియపరుస్తున్నారు. 2028 పరిస్థితి ఎలా ఉంటుందో సముద్రంలో 2027 ఏప్రిల్ నెలలో మళ్లీ టెస్ట్ చేసి చెప్తారు. ఇది కొద్ది సంవత్సరాల వరకు కంటిన్యూ అవుతుందా లేదా అనేది వచ్చే సంవత్సరం శాస్త్రవేత్తలు మనకు తెలియపరుస్తారు. ఖర్చులు తగ్గించుకోండి మినిమం మెయింటినెన్స్ చేసుకోవాల్సిందిగా ప్రజా వాయిస్ నుంచి



United States El Niño Impacts | NOAA Climate.gov

తెలియజేస్తున్నాము పరిస్థితులు అనుకూలంగా లేవని ఈ కరువు పరిస్థితుల వలన సర్దుబాటు తత్వంతో మసలుకోవాలని ప్రజా వాయిస్ నుంచి తెలియ చేస్తున్నాము. అందరూ జాగ్రత్తగా ఉండండి.

# సిద్ధిపేట కోనోకార్పస్ వివాదం

**సామాజిక కార్యకర్త చక్రధర్ గౌడ్ పిటిషన్‌పై హైకోర్టు సంచలన తీర్పు**

**ప్రజా వాయిస్: సిద్ధిపేట**

సిద్ధిపేట పట్టణంలో పర్యావరణానికి గొడ్డలిపెట్టుగా, ప్రజల శ్వాసకు శత్రువుగా మారిన కోనోకార్పస్ చెట్ల తొలగింపునకు హైకోర్టు ద్వారా ముందడుగు పడింది. ఈ చెట్లను తొలగించి, వాటి స్థానంలో స్థానిక వృక్షజాతులను నాటాలంటూ దాఖలైన రిట్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా కీలక ఆదేశాలు జారీ చేశారు. బాధితుల వినతిని తక్షణమే పరిశీలించి, నాలుగు వారాల వ్యవధిలో చట్టప్రకారం తగిన చర్యలు పూర్తి చేయాలని మున్సిపల్ యంత్రాంగాన్ని ఆదేశించారు.సామాజిక కార్యకర్త, సిద్ధిపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి గాదగోని చక్రధర్ గౌడ్ ఈ న్యాయపోరాటానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో కోనోకార్పస్ తెస్తున్న ముప్పుపై సెప్టెంబర్ 9న అధికారులకు వినతిపత్రం ఇచ్చినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో చక్రధర్ గౌడ్ తరఫు న్యాయవాది రేకులపేట సుధాకర్ బలమైన వాదనలు వినిపించారు. శీతాకాలంలో ఈ చెట్ల వల్ల శ్వాసకోశ అలర్జీలు, దీర్ఘకాలిక దగ్గు, ఉబ్బసం (ఆస్తమా) వంటి వ్యాధులు తీవ్రమవుతాయని, తక్షణమే స్పందించకపోతే ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని కోర్టుకు వివరించారు. భూగర్భజలాలను తోడేస్తూ, జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న ఈ పరాయి దేశపు మొక్కల వల్ల మౌలిక సదుపాయాలు కూడా ధ్వంసమవుతున్నాయని పేర్కొన్నారు.ఈ వాదనలకు మద్దతుగా దేశంలో కోనోకార్పస్ జాతుల వల్ల తలెత్తుతున్న పర్యావరణ ముప్పుపై కేంద్ర సాధికార కమిటీ (జజుజ) ఇచ్చిన అధికారిక నివేదిక (నెం. 40/2025)తో పాటు, సుప్రీంకోర్టులోని చారిత్రాత్మక పర్యావరణ కేసు (టి.ఎన్. గోదావర్మన్ తిరుముల్పాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా) పత్రాలను హైకోర్టు ముందు ఉంచారు. వీటిని పరిశీలించిన న్యాయస్థానం మున్సిపల్ అధికారులకు గడువు విధిస్తూ స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా అధికారులు కదిలి వస్తారో లేదో చూడాలని చక్రధర్ గౌడ్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.



# కీసర ఎక్స్ రోడ్ వద్ద 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

**"సురక్షితంగా ప్రయాణిద్దాం.. క్షేమంగా గమ్యస్థానానికి చేరుకుందాం"**
**వాహనదారుల వేగం కన్నా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న కీసర సిఐ రమేష్**










**ప్రజావాయిస్, కీసర :**

కీసర పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో కీసర ఎక్స్ రోడ్ వద్ద 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడం వంటి అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ.. వేగంగా వాహనాలు నడపకుండా, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఇతర వాహనదారుల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని వాహనదారులు ను కోరారు. "సురక్షితంగా ప్రయాణిద్దాం.. క్షేమంగా గమ్యస్థానానికి చేరుకుందాం" అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు....

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థి గెలుపే లక్షంగా పని చెయ్యాలి

**ఉమ్మడి మండల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి బోడ నవీన్ నాయక్**

**ప్రజా వాయిస్ కొత్త గూడ**

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి గెలుపుకై పార్టీ శ్రేణులు కృషి చెయ్యాలని కొత్తగూడ, గంగారం మండలాల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి బోడ నవీన్ నాయక్ అన్నారు. కొత్తగూడ మండల కేంద్రం లో బీజేపీ కొత్తగూడ మండల అధ్యక్షులు యాదగిరి మురళి,బీజేపీ గంగారం మండల అధ్యక్షులు సువర్ణపాక నరేందర్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోడ నవీన్ నాయక్ మాట్లాడుతు గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి వారి ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని, నరేంద్ర మోదీ గారి సంక్షేమ పథకాలను వివరించి కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగుల ప్రయోజనం కై ప్రవేశ పెట్టిన పథకాలపై వారికీ అవగాహనా కలిపించాలని అన్నారు. పట్టభద్రుల ఓట్ల తో గతంలో గెలిచినా నాయకులు ఏనాడూ నిరుద్యోగుల సమస్యలు వారి ఉపాధి అవకాశాలపై ఎప్పుడు కూడ ఆలోచన చెయ్యలేదని అన్నారు. పట్టభద్రులు బీజేపీ పార్టీ కి అవకాశం ఇస్తే నిరుద్యోగ సమస్యలు వారి ఆకాంక్ష లను ప్రభుత్వాన్ని ప్రశ్నించి వారికి న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా కార్యదర్శి తోటకూరి మధు,మండల ప్రధాన కార్యదర్శులు బోనాల ప్రవీణ్ చారి, వజ్జ రవి,బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ స్వామి నాయక్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బానోత్ శివరాం నాయక్,బీజేపీ మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఇర్ప స్వరూప,జాడి దిలీప్ చంద్ర, గంగాపురపు బిక్షపతి, భూక్యా నందా నాయక్,సిరబోయిన యాకయ్య,పెనుక రామయ్య,గుగులోత్ రూప్లా నాయక్,బానోత్ హరిలాల్ నాయక్,పిన్నింటి రవీందర్,బానోత్ బాలాజీ, మోకాళ్ళ సమ్మయ్య, కత్తే కాంతరావు తదితరులు పాల్గొన్నారు.







**రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కు**

# ఘన స్వాగతం

**గ్రామ అభివృద్ధి పనులపై ఆరా తీసిన కమిషనర్ దివ్య ఐఏఎస్**

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య ఐఏఎస్ కి మండల పరిధి వినోభానగర్ గ్రామ సర్పంచ్ నవీన్, అధికారులతో కలసి ఘన స్వాగతం పలికారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా ముఖద్వారా గ్రామమైన వినోభానగర్‌లో పీఆర్ కమిషనర్ కి సర్పంచ్, జిల్లా, మండల అధికారులు పుష్పగుచ్ఛాలతో సాదర ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, పారిశుధ్యం, ఉపాధి హామీ పనుల నిర్వాహణ తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ముఖద్వారంగా ఉన్న గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆదర్శవంతంగా కనిపించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, ఉపాధి నిధుల సద్వినియోగం పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, డిప్యూటీ కమిషనర్, ప్రాజెక్ట్ డైరెక్టర్, డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, ఈసీ, గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# భద్రకాళి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన వరంగల్ సీపీ ఎన్. శ్వేతా

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

వరంగల్ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈ నెల 11 వ తేదీ నుండి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముందస్తు భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఉత్సవాల సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ తరపున చేపడుతున్న చర్యలను సిపి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు మరియు భద్రతా విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, హన్మకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, మట్టెవాడ, ఇంతేజర్ గంజ్, మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్లు, ఆలయ పాలక మండలి, అర్చకులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు: ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి...

**ప్రజా వాయిస్/ అనుమల:**

హాలియా పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి 93,294 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి పంపిణీ చేశారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కార్యక్రమంలో పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల మరియు పట్టణ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మైనంపాటి సైదిరెడ్డి మృతి బాధాకరం: ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి...

**ప్రజా వాయిస్ : హాలియా : 06 అక్టోబర్**

నల్లగొండ జిల్లా:హాలియా మున్సిపాలిటీ2వ వార్డ్ నందు హాలియా పట్టణానికి చెందిన మైనంపాటి సైదిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. నాగార్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ఈరోజు వారి నివాసంలో వారి పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వీరితోపాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, చిట్టిపోలు కరుణాసాగర్, స్థానిక కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ-సైదులు, వర్కాల సుధాకర్ రెడ్డి, వర్కాల మల్లారెడ్డి, గౌస్, దండ రామ్ రెడ్డి, చలకాని గోవర్ధన్, హరి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



## కొండాపూర్‌లో ఘనంగా మహిళా సంఘం భవన నిర్మాణ శంకుస్థాపన

**శంకుస్థాపన చేసిన జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకట్ రెడ్డి**

**మోటకొండూరు/ ప్రజా వాయిస్:-**

యాదాద్రి-భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం కొండాపూర్ గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి మంగళవారం రోజున శంకుస్థాపన చేశారు. ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో మహిళా సంఘం భవనం కోసం రూ. 10 లక్షల రూపాయలు మంజూరు కావడం పట్ల గ్రామ మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవన నిర్మాణానికి యాదాద్రి-భువనగిరి జిల్లా సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, మహిళా సంఘాలకు సొంత భవనం ఉండటం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపురం ఉపసర్పంచ్ కొప్పుల మహేందర్ రెడ్డి, సీసీ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి కోటేష్, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, వీడియో సిరిపంగా భాష, మహిళా సంఘం అధ్యక్షురాలు పంజాల రోస, మనమ్మ, విజయ, అలివేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కరవు పరిస్థితులు.. 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం

ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది.ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు. నైరుతి రుతుపవనాల (జూన్-సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఎల్ నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి, ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది.ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. గతంలో సుమారు 235 మండలాల్లో కరవు పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేయగా, తాజా అంచనాల్లో ప్రకారం ఆ సంఖ్య 320కి పెరిగింది.

# ఫుట్‌పాత్‌లపై దర్జాగా వ్యాపారాలు


**దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా పార్కింగ్,**
**పాదచారులకు రోడ్డే దిక్కు**
**కీసర-ఘట్కేసర్ సర్కిళ్లలో పట్టించుకోని అధికారులు ?**
**ప్రమాదాలు జరిగితేనే అధికారుల హడావిడి ఉంటుందా ?**
**ఫుట్ పాత్ లు అందుబాటులోకి తేవాలని కోరుతున్న ప్రజలు**

**ప్రజావాయిస్, కీసర, ఘట్కేసర్ సర్కిల్ :**

పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు నిలయాలుగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేడ్చల్ జిల్లా కీసర, ఘట్కేసర్ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రధాన రహదారుల వెంట కొందరు దుకాణదారులు ఫుట్‌పాత్‌లను తమ వ్యాపార అవసరాలకు ఆక్రమించి వినియోగించుకుంటున్నారని పాదచారులు అంటున్నారు. కొన్ని చోట్ల దుకాణాల ముందు వాహనాల పార్కింగ్‌తో నడిచే దారి పూర్తిగా మూసుకుపోతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రోడ్డుకు అనుకుని వ్యాపారాలు కోనసాగిస్తుండటంతో , వ్యాపార ప్రకటన బోర్డులు, వాహన పార్కింగ్ లతో పూర్తిగా ఫుట్ పాత్ అక్రమిస్తున్నారని అంటున్నారు.

**రోడ్డుపైనే పాదచారుల నడక !**


ఫుట్‌పాత్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు




నేరుగా ప్రధాన రహదారిపైకి వచ్చి నడవాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు రోడ్డుపై వాహనాల మధ్య నుంచి వెళ్లాల్సి వస్తుండటంతో ప్రమాదాలకు ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులలో ఉన్న ఫుట్ పాత్ లు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఫుట్ పాత్ లు ఆక్రమణకు గురైన ప్రదేశాలలో అధికారులు పర్యవేక్షించి , ప్రమాదాల నుండి విముక్తి కల్పించాలి అంటున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

రోడ్డు పక్కన ఆక్రమణలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయా? ఉంటే వాటిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్నది అధికారులే స్పష్టం చేయాల్సి ఉంది.ప్రమాదం జరిగిన తర్వాత మేల్కొనే పరిస్థితి




రాకముందే ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించి, పాదచారులకు నడక మార్గాన్ని పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఫుట్‌పాత్‌లు ప్రజల కోసం.. వ్యాపారాల కోసం కాదని అధికారులు స్పష్టం చేసి, కీసర--ఘట్కేసర్ సర్కిళ్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# పీహెచ్‌సీ లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**వేములపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**ప్రజావాయిస్ వేములపల్లి,**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం వేములపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ వివరాలు, రోగుల రిజిస్ట్రేషన్, డెంగ్యూ, పాము కాటు కేసులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, డ్రగ్స్ రిజిస్టర్ తదితరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలు, నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జలుబు, దగ్గు తదితర సీజనల్ వ్యాధుల కేసులు అధికంగా వస్తున్నట్లు వైద్యాధికారి కలెక్టర్‌కు వివరించారు.అనంతరం ఆశా కార్యకర్తలతో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఆశా కార్యకర్త తమ డైరీలో ప్రజల ఆరోగ్య సమస్యలు,



గర్భిణులు, ఇతర ముఖ్యమైన వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. గర్భిణులను అవసరమైన సమయంలో ఏరియా ఆసుపత్రికి తరలించేలా ముందస్తు అవగాహన కల్పించాలన్నారు.డెంగ్యూ వ్యాధి వ్యాప్తికి అవకాశం లేకుండా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణకు పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారిని ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు వినియోగించేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. అదేవిధంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ప్రజలకు, అర్హులైన బాలికలకు అవగాహన కల్పించి వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పీహెచ్‌సీలోని అన్ని రిజిస్టర్లను, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హేమలత, ఇంచార్జ్ ఎంపీడీవో జ్యోతి, హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి. సుచరిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్. ప్రవీణ్, సూపర్వైజర్ శాంతమ్మ, రికార్డ్ అసిస్టెంట్ బి. సోములు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# కేంద్రం సహకారం - రాష్ట్రం ప్రచారమా.?

**రేషన్ కార్డులపై మోదీ పేరు, ఫొటో లేకపోవడంపై బీజేపీ నేత బొక్కా బాల్ రెడ్డి ఫైర్**

**ప్రజా వాయిస్//రాజేంద్రనగర్:**

అత్తాపూర్ సర్కిల్ ఉప్పరపల్లిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా కేంద్రం-రాష్ట్రం మధ్య క్రెడిట్ అంశం రాజకీయ చర్చకు దారితీసింది.రేషన్ వ్యవస్థలో రాష్ట్రానికి,కేంద్ర ప్రభుత్వ సహకారం ఉన్నప్పటికీ,కొత్త రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ పేరు,ఫొటో లేకపోవడంపై బీజేపీ నేత బొక్కా బాల్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొక్కా బాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు ఉచిత ఆహార ధాన్యాల అందజేతలో కేంద్ర ప్రభుత్వం కీలకంగా సహకరిస్తోందన్నారు. అయితే రేషన్ కార్డులపై కేంద్ర ప్రభుత్వ పాత్రకు కనీస గుర్తింపు లేకపోవడం సరికాదని




అన్నారు.కేంద్రం సహకారం ఉంటే,గుర్తింపు ఎందుకు లేదు.? అని ప్రశ్నించిన ఆయన,రాష్ట్ర ప్రభుత్వం తన కార్యక్రమాల ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు రేషన్ కార్డులపై ప్రధాని మోదీ పేరు,ఫొటోకు కూడా చోటు కల్పించాలని డిమాండ్ చేశారు.పేదల సంక్షేమ పథకాల్లో కేంద్రం, రాష్ట్రం చేస్తున్న కృషిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని బొక్కా బాల్ రెడ్డి కోరారు.రేషన్ కార్డుల అంశాన్ని రాజకీయ ప్రచారానికి కాకుండా పేదల సంక్షేమానికి సంబంధించిన అంశంగా చూడాలన్నారు.కార్యక్రమంలో ఉప్పరపల్లి రేషన్ డీలర్ నరసింహ, ఎర్రబోడ రేషన్ డీలర్ తిరుపతి రెడ్డి,బీజేపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నరేందర్,భూపాల్,మనోజ్ తదితరులతో పాటు లబ్ధిదారులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆత్మనిర్భర్ భారత్‌లో మరో ముందడుగు..

# డీఆర్‌డీవో హెచ్‌ఏపీఎస్ ప్రయోగం సక్సెస్

డీఆర్‌డీఓ తన ప్రస్థానంలో మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ (హెచ్‌ఏపీఎస్) ప్రయోగాత్మక పరీక్షను మంగళవారం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా ఎయిర్ షిప్ ఏకంగా 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, భారత నిఘా, వైమానిక సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన విజయాన్ని నమోదు చేసింది.రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రయోగాత్మక ఎయిర్ షిప్ సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. అనంతరం సుమారు 20 కిలోమీటర్ల ఎత్తులో 30 నిమిషాలకు పైగా స్థిరంగా ప్రయాణించి తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది. ప్రయోగం ముగిసిన తర్వాత కమాండ్ మేరకు ఇది సురక్షితంగా భూమికి చేరుకుంది. ఈ ప్రక్రియలో ప్లాట్‌ఫామ్ నుంచి రియల్-టైమ్ వీడియోతో పాటు వాహన వనితీరుకు సంబంధించిన డేటా నిరంతరాయంగా గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు చేరింది.ఆగ్రాలోని డీఆర్‌డీవో అనుబంధ ల్యాబొరేటరీ అయిన 'ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' (ఏడీఆర్‌డీఈ) ఈ ప్లాట్‌ఫామ్‌ను డిజైన్ చేసి అభివృద్ధి చేస్తోంది. గాలి కంటే తేలికైన ఈ వ్యవస్థను సుదీర్ఘ కాలం పాటు గగనతలంలో నిరంతరాయంగా పనిచేసేలా రూపొందిస్తున్నారు. ఇది నిఘా, కమ్యూనికేషన్స్ వంటి కీలక కార్యకలాపాలకు ఎంతగానో దోహదపడుతుంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్), డీజీసీఏ, ఏఏఐ వంటి పలు సంస్థల సమన్వయంతో ఈ ఫ్లైట్ ట్రయల్‌ను నిర్వహించారు.ఈ అద్భుత విజయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను, వైమానిక దళాన్ని ఇతర భాగస్వామ్య సంస్థలను ఆయన అభినందించారు. అధునాతన ఏరోస్పేస్ సాంకేతిక పరిజ్ఞానంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ఇది ఒక కీలక మైలురాయి అని ఆయన కొనియాడారు.





## 2027 ప్రపంచకప్‌కు భారీ డిమాండ్.. లక్షల్లో టికెట్ దరఖాస్తులు

2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచకప్‌పై అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. టికెట్ బ్యాలెట్ ప్రారంభమైన మూడు రోజుల్లోనే పది లక్షలకు పైగా దరఖాస్తులు వెల్లువెత్తడం ఈ మెగా టోర్నీ క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ క్రీడా సంబరానికి ప్రపంచవ్యాప్తంగా అపూర్వ స్పందన లభిస్తోంది.ఐసీసీ మంగళవారం వెల్లడించిన గణాంకాల ప్రకారం, ఇప్పటికే 3.2 లక్షల మంది అభిమానులు రిజిస్టర్ చేసుకోగా, మొత్తం 11 లక్షల టికెట్ల కోసం దరఖాస్తులు అందాయి. ఎప్పటిలాగే భారత్-పాకిస్థాన్ పోరుకు అత్యధికంగా 1.10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత భారత్-దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు 92,000, భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌కు 86,000 దరఖాస్తులు వెల్లువెత్తాయి. నవంబర్ 21న జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం కూడా సుమారు 69,000 మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం.ఈ భారీ స్పందనపై ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా స్పందిస్తూ, “కేవలం 48 గంటల్లోనే 10 లక్షల టికెట్ దరఖాస్తులు రావడం ప్రపంచకప్‌కున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఆఫ్రికా ఖండంలో ఈ టోర్నీ నిర్వహిస్తుండటం ఆఫ్రికా సత్తాను ప్రపంచానికి చాటేందుకు ఒక చక్కని తరుణం” అని పేర్కొన్నారు.స్థానిక ఆర్గనైజింగ్ కమిటీ సీఈఓ ఖొండిసా ఎంగ్వెన్యా మాట్లాడుతూ, ఈ స్థాయి స్పందన టోర్నీపై నెలకొన్న ఆసక్తికి నిదర్శనమని అభివర్ణించారు. “ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సాదర స్వాగతం పలుకుతున్నాయి. మా ప్రాంతీయ సంస్కృతిని, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం” అని ఆయన తెలిపారు. కాగా, 2027 ప్రపంచకప్ టికెట్ల కోసం ఆసక్తి గల అభిమానులు నవంబర్ 21 వరకు టికెట్ బ్యాలెట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.




## తమిళనాడు సీఎం విజయ్‌ను కలిసిన టీడీపీ ఎంపీలు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను తెలుగుదేశం పార్టీ ఎంపీల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. విజయవాడలో నిర్వహించనున్న ‘విజయవాడ ఉత్సవ్’కు ఆయనను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ విషయాన్ని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తన ‘ఎక్స్’ ఖాతా ద్వారా వెల్లడించారు.లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలోని ఈ బృందంలో ఎంపీలు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కేశినేని శివనాథ్, జి.ఎం.సి. హరీశ్ బాలయోగిలతో పాటు విజయవాడ ఉత్సవ్ కమిటీ చైర్మన్ కె. మురళి ఉన్నారు. ఈ భేటీ ఎంతో ఆత్మీయంగా, చిరస్మరణీయంగా జరిగిందని శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. సీఎం విజయ్ చూపిన వినయం, ఆప్యాయత, సౌజన్యం తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు.తెలుగు, తమిళ ప్రజల మధ్య సరిహద్దులకు అతీతమైన సాంస్కృతిక, కళా, సినీ, సంప్రదాయ బంధం ఉందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఈ స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు ‘విజయవాడ ఉత్సవ్’ ఒక అద్భుతమైన వేదిక అని ఆయన వివరించారు. ఈ వేడుక కోసం విజయ్‌ను విజయవాడకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని, ఆయన రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

## అధికారినిని అంటూ వల..

### ఆప్ నేతను పెళ్లాడి నగలతో ఉడాయించిన మహిళ!

పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత ఒకరు పెళ్లి పేరుతో భారీ మోసానికి గురయ్యారు. తాను పంజాబ్ సివిల్ సర్వీసెస్ (పీసీఎస్) అధికారినినని నమ్మించిన ఒక మహిళ, ఆయన్ను వివాహం చేసుకుని బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులతో పరారైంది. ఈ ఘటన ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలో వెలుగుచూసింది.వివరాల్లోకి వెళితే.. ఆప్ జిల్లా సంయుక్త కార్యదర్శి, జిల్లా పరిషత్ సభ్యుడు అమరీందర్ సింగ్ మండోఫల్, ఈ ఏడాది ఫిబ్రవరిలో మన్‌విందర్ కౌర్ అనే మహిళను వివాహం చేసుకున్నారు. ఈ వివాహ వేడుకకు పంజాబ్ అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్, క్యాబినెట్ మంత్రి తరుణ్‌ప్రీత్ సింగ్ సౌంధ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు.అయితే, వివాహమైన కొద్ది రోజులకే మన్‌విందర్ కౌర్ ఇంట్లోని నగలు, విలువైన వస్తువులతో అదృశ్యమైంది. తాను మోసపోయానని గుర్తించిన అమరీందర్ సింగ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. మన్‌విందర్, ఆమె కుటుంబ సభ్యులు.. ఆమెను పెళ్లికాని పీసీఎస్ అధికారిణిగా పరిచయం చేశారని, వయసు విషయంలోనూ తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పెళ్లి అనంతరం ఆమెకు ఇప్పటికే విడాకులయ్యాయని, 18 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడని, అసలు ఆమెకు ప్రభుత్వ ఉద్యోగమే లేదని తెలిసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వయసు తక్కువగా చూపించేందుకు పత్రాలను సైతం తారుమారు చేశారని ఆయన ఆరోపించారు.అమరీందర్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు మన్‌విందర్ కౌర్‌తో పాటు ఆమె సోదరుడు, తల్లి, ఇతర బంధువులతో కలిపి మొత్తం ఆరుగురిపై మోసం, ఫోర్జరీ కేసులు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు ప్రస్తుతం లోతైన దర్యాప్తు జరుపుతున్నారు.

## ఒక్క మిల్లీమీటర్ మా భూభాగంలోకి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవు: దక్షిణ కొరియాకు ఉత్తర కొరియా హెచ్చరిక

ఇరు కొరియాల మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. తమ భూభాగంలోకి ఒక్క మిల్లీమీటర్ అడుగుపెట్టినా తక్షణమే, అత్యంత శక్తిమంతంగా ప్రతిఘటిస్తామని ఉత్తర కొరియా మంగళవారం దక్షిణ కొరియాను తీవ్రంగా హెచ్చరించింది. సరిహద్దులో ఇటీవల జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడు ఘటనపై దక్షిణ కొరియా తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.సెప్టెంబర్ 21న ఇరు దేశాల సరిహద్దులోని సైనిక రహిత ప్రాంతం దక్షిణ భాగంలో జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఇద్దరు దక్షిణ కొరియా సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుళ్లకు ఉత్తర కొరియానే కారణమని, వారు ఉద్దేశపూర్వకంగానే మైన్‌లను అమర్చారని దక్షిణ కొరియా సైన్యం దర్యాప్తులో పేర్కొంది. దీనికి ప్రతిస్పందనగా, ఐక్యరాజ్యసమితి కమాండ్ సహకారంతో దక్షిణ కొరియా ఆ ప్రాంతంలో మైన్‌లను తొలగించే ఆపరేషన్‌ను చేపట్టింది. దీన్ని ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా తీసుకున్న



నిర్ణయాత్మక చర్యగా దక్షిణ కొరియా రక్షణ మంత్రి కాంగ్ షిన్-చుల్ అభివర్ణించారు.ఈ పరిణామాలపై ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ల్యాండ్‌మైన్ పేలుడుతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ మేరకు ఆరోపణలను పూర్తిగా ఖండించింది. దక్షిణ కొరియా ఉద్దేశపూర్వకంగా కట్టుకథ అల్లి, తమపై నిందలు వేస్తోందని, అంతర్జాతీయంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. “ఒకవేళ దక్షిణ కొరియా సైనికులు సరిహద్దు రేఖను దాటి మా భూభాగంలోకి ప్రవేశిస్తే, మా సరిహద్దు దళాలు తక్షణమే శక్తిమంతమైన ప్రతిచర్య తీసుకుంటాయి” అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.ఈ వివాదానికి ప్రధాన కారణం సరిహద్దు రేఖ పై స్పష్టత లేకపోవడమేనని వాదనలు వినిపిస్తున్నాయి. 1953 యుద్ధ విరమణ ఒప్పందం సమయంలో ఏర్పాటు చేసిన 1,292 సరిహద్దు గుర్తింపు చిహ్నాలలో చాలా వరకు కాలక్రమేణా దెబ్బతినడంతో, ప్రస్తుతం కేవలం 200 మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు రేఖపై నెలకొన్న అనిశ్చితిని పరిష్కరించడానికి చర్చలు జరపాలని దక్షిణ కొరియా ప్రతిపాదించినప్పటికీ, అందుకు తాము సిద్ధంగా లేమని ఉత్తర కొరియా స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాల్లో చర్చలకు తావులేదని, బల ప్రయోగంతోనే తమ భూభాగాన్ని కాపాడుకుంటామని తేల్చి చెప్పింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

## పోలీసుల అదుపులో రాహుల్ గాంధీ, ప్రియాంక.. ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద ఉద్రిక్తత

దేశ రాజధాని ఢిల్లీ మంగళవారం విపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘ఇండియా’ కూటమి చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు, హైడ్రామాకు దారితీసింది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం ‘నిర్వాచన్ సదన్’ వైపు నిరసన ర్యాలీగా బయలుదేరారు. అయితే, ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని



మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ బారికేడ్లు ఎక్కి, చేతిలో జాతీయ జెండాను ప్రదర్శిస్తూ తన నిరసనను తీవ్రతరం చేశారు. అనంతరం ఇతర నేతలతో కలిసి రోడ్డుపైనే బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రంగప్రవేశం చేసి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (యూబీటీ) సహా పలువురు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని బస్సుల్లోకి ఎక్కించారు. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత లోపించిందని, అవకతవకలు జరుగుతున్నాయని విపక్షాలు గత కొద్ది వారాలుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నాయి. ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని కూడా వార్తలు వచ్చాయి. దీనిపై రాహుల్ సోషల్ మీడియాలోనూ స్పందించారు. “జ్ఞానేశ్, ఇక ముగిసింది. రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది” అని ఆయన ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

## ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు.. అతి కొద్దిమంది నేతల్లో మోదీ ఒకరు!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 అక్టోబర్ 7న బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు, ప్రధానమంత్రిగా కొనసాగుతూ.. ప్రభుత్వ అధినేతగా నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. పాతికేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన అతికొద్ది మంది ప్రపంచ నేతల జాబితాలో ఆయన స్థానం సంపాదించారు.భారతదేశంలో, ఎన్నికైన ప్రభుత్వానికి అధిపతిగా సుదీర్ఘకాలం పనిచేసిన రికార్డును మోదీ ఇప్పటికే అధిగమించారు. గతంలో ఈ రికార్డు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ నేత అయిన చామ్లింగ్ డిసెంబర్ 1994 నుంచి మే 2019 వరకు మొత్తం 24 సంవత్సరాల 165 రోజుల పాటు సీఎంగా పనిచేశారు.దేశంలో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతిబసు కూడా ఉన్నారు. బిజూ జనతాదళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ మార్చి 2000 నుంచి జూన్ 2024 వరకు 24 సంవత్సరాల 99



రోజుల పాటు సీఎంగా సేవలందించారు. ఆయన తన స్వచ్ఛమైన ఇమేజ్, విపత్తు నిర్వహణ సామర్థ్యం, మహిళా సాధికారత కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక, సీపీఎం నేత జ్యోతిబసు జూన్ 1977 నుంచి నవంబర్ 2000 వరకు 23 సంవత్సరాల 137 రోజుల పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలు, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు.అంతర్జాతీయంగా చూస్తే, సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ 1959 నుంచి 1990 వరకు ఏకంగా 31 ఏళ్లు నిరంతరాయంగా అధికారంలో ఉన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో సుదీర్ఘ పాలనకు ఆయనను ఒక ఆధునిక కొలమానంగా పరిగణిస్తారు. ఆయన నాయకత్వంలో సింగపూర్ పేదరికం నుంచి ప్రపంచంలోని అత్యంత సంపన్న దేశాల్లో ఒకటిగా ఎదిగింది. కంబోడియాలో హున్ సేన్ 1985 నుంచి 2023 వరకు ప్రధానిగా పనిచేసి, ఆధునిక ప్రపంచంలో ఎక్కువ కాలం పనిచేసిన నేతల్లో ఒకరిగా నిలిచారు. మలేషియాలో మహతీర్ మొహమ్మద్ రెండు పర్యాయాల్లో కలిపి 24 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేశారు.ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పోటీతత్వ ప్రజాస్వామ్యంలో వరుస ఎన్నికల విజయాలతో ఈ 25 ఏళ్ల మైలురాయిని చేరుకోవడం మోదీ విషయంలో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది. “వికసిత భారత్” లక్ష్యంతో ఆయన ప్రస్థానం ఇంకా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న అనేక మంది నేతలు వివాదాస్పద పాలకులుగా ముద్రపడగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికవుతూ మోదీ ఈ ఘనత సాధించడం గమనార్హం.

## కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు.. కొత్త స్టీల్ బ్రిడ్జికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ గతంలో ప్రతిపాదించిన బహుళ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో సరికొత్తగా డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు రూ. 1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుంది.సవరించిన ప్రణాళిక ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫఖంజా కాలేజీ వరకు ఆరు లేన్ల స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి) నిర్మించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1 వైపు వెళ్లేందుకు వీలుగా దీనికి ఒక ర్యాంప్‌ను కూడా అనుసంధానిస్తారు. గతంలో ఈ పనులకు సంబంధించి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన ‘లెటర్ ఆఫ్ అవార్డు’ను ఉపసంహరించుకుని, కొత్త డిజైన్ బాధ్యతలను



మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించారు. భూసేకరణ వ్యయం తగ్గడం వల రూ. 800 కోట్లు, నిర్మాణ ఖర్చు తగ్గడం వల్ల మరో రూ. 400 కోట్లు కలిపి మొత్తం రూ. 1200 కోట్లు ఆదా అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ ప్రాజెక్టుపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ గతంలో తలపెట్టిన హెచ్-సిటీ పనులను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వన్-వే విధానం సత్ఫలితాలను ఇస్తుండటంతో దానినే శాశ్వతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం ఆదా అవుతుందని, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జిని నిర్మించి, వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్ల నరికివేతపై కోర్టు ఆంక్షల కారణంగా పాత ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగింది. మాదాపూర్, హైటెక్ సిటీ వైపు వెళ్లే వాహనదారులకు సిగ్నల్-ఫ్రీ ప్రయాణాన్ని కల్పిస్తూనే, పార్క్‌లోని పచ్చదనానికి కనీస నష్టం కలగకుండా ఈ సరికొత్త కారిడార్‌ను ప్రభుత్వం రూపొందించింది.

# పరగడుపున పండ్లు తినవచ్చా? ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారంటే..!




పరగడుపున పండ్లు తినొచ్చా? తినకూడదా? తింటే ఏమవుతుంది? చాలామందిలో మెదిలే ప్రశ్న ఇది. ఈ అంశంపై ఒక్కొక్కరు ఒక్కో అభిప్రాయం వ్యక్తం చేస్తుంటారు. కొందరు ఖాళీ కడుపుతో పండ్లను తీసుకోవద్దని చెబితే.. మరికొందరు ఖాళీ కడుపుతోనే పండ్లను తినాలని చెబుతుంటారు. మరి నిజంగా పరగడుపున పండ్లు తినొచ్చా? తింటే ఎలాంటి పండ్లను తినాలి? ఎలాంటి పండ్లను తినకూడదు? పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం..ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఉదయం పూట ఖాళీ కడుపుతో పండ్లు తినవచ్చు. అయితే, ఎలాంటి పండ్లు తింటున్నారనేదే ఇక్కడ కీలకం. ఉదయాన్నే పరగడుపున ఆపిల్, బొప్పాయి, పుచ్చకాయ వంటి పండ్లను తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. అరటిపండు తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**ఖాళీ కడుపుతో పండ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు..**

ఉదయాన్నే పండ్లు తినడం వలన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పండ్లు తేలికగా, సులభంగా జీర్ణమవుతాయి. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. పండ్లలో ఉండే పీచుపదార్థం, విటమిన్లు, ఖనిజాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. కడుపు నిండిన భావన కలిగి, పదేపదే తినే అలవాటు తగ్గుతుంది.

**ఇది అందరికీ వర్తిస్తుందా?**

ఖాళీ కడుపుతో పండ్లు తినడం అందరికీ సరికాదు. అజీర్తి, యాసిడ్ రిఫ్లక్స్ సమస్యలు ఉన్నవారు ఉదయాన్నే పండ్లు తినడం వలన దుష్ప్రభావాలు కలుగుతాయి. ప్రధానంగా నారింజ, అరటిపండ్లు లాంటివి ఉదర సమస్యలకు దారితీస్తాయి. బొప్పాయిని కూడా మితంగా తీసుకోవడం మంచిది.

**పండ్లు ఎలా తినాలి..?**

ఎప్పుడైనా సరే తాజా పండ్లనే తినాలి. పండ్ల రసాన్ని తాగడం కంటే వాటిని నేరుగా తినడం వలన ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. అయితే, అన్ని రకాల పండ్లను కలిపి ఒకేసారి అధిక పరిమాణంలో తినకూడదు. పండ్లు తిన్న వెంటనే ఆహారం తినడం కూడా మంచిదికాదు.

# ఆరోగ్యసిరి... ఉసిరి

**'సూరిమాను' అసలు పేరు. జనవ్య వహారంలో ఉసిరిమాను అయ్యింది. సూరి అంటే సూర్యుడు. ఉసిరిలో సూర్యతేజస్సు ఉంది. అందుకని ఆదివారం నాడు ఉసిరిని పూజించాలే గాని దంచుకుని, వండుకుని తినొద్దని ఓ గౌరవపూర్వక ఆచారం ఉంది!**



ఉసిరికాయ, తానికాయ, కరక్కాయ మూడింటినీ త్రిఫలాలంటారు. ఇవి లేకుండా ఆయుర్వేద ఔషధాలు లేనట్టే, ఉసిరి లేని భోజనం కూడా అసంపూర్ణం. ఉసిరి ఎంతటి ఔషధమో అంతటి కూరగాయ! దాన్ని వండుకోవాలంటే యుక్తి కావాలి. పాకశాస్త్రగ్రంథాలు ఉసిరికాయతో అనేక వంటకాలను వివరించాయి.

**క్షేమకుతూహలంలో ఉసిరికాయల కూర:** పెద్దవిగా ఉన్న ఉసిరికాయలకు నూనె పట్టించి 'అంగారపాకం' అంటే నిప్పుల మీద లోపలి గుజ్జంతా ఉడికేవరకూ కాల్చాలి. ఓవెన్లున్న వాళ్లు గ్రిల్ చేయొచ్చు. పైన మాడు వలిచేసి, గింజ ఏరేసి లోపలి గుజ్జు మాత్రమే తీసుకోండి. మట్టి లేదా గాజు మూకుడులోతాలింపు గింజలు వేగించి ఇష్టమైన సుగంధ ద్రవ్యాలు, తగినంత ఉప్పు, మిరియాలపొడి కలిపి అందులో ఈ ఉసిరిగుజ్జు చేర్చి కాసేపు మగ్గ బెడితే ఉసిరి కాయల కూర సిద్ధం అయినట్టే! లోహపు బాండీల్లో వండవద్దనేది చెప్పదగిన సూచన. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది!

**చక్రదత్తలో ఉసిరి హల్వా:** చక్రదత్త అనే ఆయుర్వేద గ్రంథంలో ఉసిరి హల్వా తయారీని వివరించింది. తాజా ఉసిరికాయ ముక్కల్ని తీసుకుని కొద్దికొద్దిగా ఉసిరికాయల జ్యూసు పోస్తూ మెత్తగా నలిగేలా దంచి అందులో తగినంత చక్కెర, తేనె, కొద్దిగా నెయ్యి కలపాలి. ఇది ఉసిరికాయల హల్వా. చ్యవనప్రాశ లేహ్యంతో సమానమైన ఔషధం. దీన్ని ఫ్రిజ్‌లో భద్రపరచి రోజూ ఒక చెంచా చొప్పున తీసుకుంటే, 80 యేళ్ళ వయసువాళ్లు కూడా ఏ రోగాలూ రావు. షుగరు వ్యాధి యవ్వనవంతులు అవుతారంటుంది చక్రదత్త. స్కూలుకెళ్ళే పిల్లలకు రోజూ పెడితే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



తెలుగువారి నల్లపచ్చిడి: బాగా కండ ఉన్న ఉసిరికాయల్ని ముక్కలుగా తరిగి ఒక పింగాణీ జాడీలోపల నూనె పట్టించి అందులోకి తీసుకోండి. ఈ ముక్కల పైన 3-4 చెంచాల పసుపు. తగినంత ఇంగువపొడి చల్లి, బాగా కలిపి ముక్కలు మునిగే వరకూ నువ్వులనూనె పోసి కదల్చకుండా ఒక పక్కన ఉంచాలి. 3-4 రోజుల్లో ముక్కలు మెత్తబడి ఉంటాయి. ఆ ముక్కల్ని మెత్తగా దంచి, లేదా మిక్సీపట్టి తగినంత సైంధవలవణం చేర్చి మూతబెట్టి, పైన ఒక తెల్లగుడ్డతో వాసెనగట్టి కనీసం 3 నెలలు కదల్చకుండా భద్రపరచాలి. ఇది వాతావరణ ప్రభావాన నల్లగా మారుతుంది. ఫ్రిజ్‌లోనే ఉంచితే నలుపు రాదు. దీని రుచిని శివుడు కూడా వర్ణించలేడంటాడు, క్షేమకుతూహలం పాకశాస్త్రగ్రంథంలో క్షేమశర్మ. ఒక వారానికి సరిపడా ఇవతలకు తీసుకుని, కొత్తిమీర వగైరా కలిపి తాజాగా తాలింపు పెట్టుకుని రోజూ ఒక చెంచా మోతాదులో మొదటి ముద్దగా తినేవారికి ఏ రోగాలూ రావు. షుగరు వ్యాధి ఉన్నవారు పసుపు కూడా చెరి సగంగా ఈ పచ్చడితో కలిపి తింటే మంచిది.

**మామిడికాయతో కలిపి పప్పు:** మామిడి లాగానే ఇంచుమించు ఏడాది పొడవునా ఉసిరికాయలు దొరుకుతున్నాయి. కాబట్టి తాజాగా తినటానికి ఒకప్పటికన్నా సౌలభ్యం ఉంది. మామిడి కాయ ముక్కలతో పాటుగా ఉసిరికాయ ముక్కలు కూడా కలిపి పప్పుగానీ, పులుసుగానీ, పచ్చడిగానీ చేసుకుంటే, ఉసిరివలన కలిగే ప్రయోజనాలన్నీ అదనంగా దొరుకుతాయి.ఉసిరికాయ వాతాన్ని తగ్గిస్తుంది. కఫాన్ని కరిగిస్తుంది. విషదోషాల్ని పోగొట్టే గుణం దీని కుంది. కంటి చూపుని పెంచుతుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. దీని రసంలో మిరియాల పొడి, పసుపు కలిపి రోజూ తాగుతూ ఉంటే గొప్ప ఇమ్యూనిటీ బూస్టర్‌గా పనిచేస్తుంది.. ముసలితనం రాకుండా కాపాడుతుంది. రక్తస్రావాన్ని ఆపుతుంది. స్త్రీ పురుషుల లైంగిక సమర్థతల్ని పెంచుతుంది. బీపీ షుగరు పైన పనిచేస్తుంది. ఉసిరికాయ దొరికితే వదలకండి. ఆరోగ్యసిరి కాయలివి!

**- డా. జి వి పూర్ణచందు, 94401 72642**

# వెజిటెబుల్ మజ్జిగ పులుసు.. ఎండాకాలం ఎంతో బెస్ట్..

ఎండాకాలం వచ్చేసింది. మండే ఎండలతో శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఇలాంటి సందర్భాల్లో శరీరంలో నీటి శాతం పడిపోకుండా చెరకు రసం, నిమ్మరసం, కర్బూజా వంటి జ్యూస్‌లు తరచుగా తీసుకోవాలి. దీనితోపాటు భోజనంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అందుకు సరైన వంటకాలను ఎంచుకోవాలి. అలాంటి వంటకాల్లో ఒకటి వెజిటెబుల్ మజ్జిగ పులుసు. ఎండాకాలం ఇదో బెస్ట్ చాయిస్ అనే చెప్పాలి. పైగా ఆంధ్ర వంటకాల్లో దీనికి ఓ అద్భుతమైన, రుచికరమైన వంటకంగా పేరుంది. ఇది ప్రత్యేకమైన రుచితోపాటు ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. వేసవికాలంలో శరీరానికి చల్లదనం ఇచ్చే ఈ పులుసు, జీర్ణక్రియనూ మెరుగుపరుస్తుంది. దీన్ని ఎలా తయారు చేసుకోవాలనేది ఇప్పుడు తెలుసుకుందాం..

కావాల్సిన పదార్థాలు..

రెండు కప్పుల మజ్జిగ, బెండకాయ, సొరకాయ లేదా దొండకాయ వంటి కూరగాయల ముక్కలు ఓ కప్పు, సన్నగా తరిగిన ఉల్లిపాయలు రెండు కప్పులు, నాలుగు పచ్చిమిర్చి, టీస్పూన్ అల్లం పేస్ట్, హాఫ్ టీస్పూన్ పసుపు, రుచికి సరిపడా ఉప్పు, ఒక కప్పు కొబ్బరి తురుము, హాఫ్ టీస్పూన్ శెనగపప్పు, హాఫ్ టీస్పూన్ జీలకర్ర, హాఫ్ టీస్పూన్ ఆవాలు, రెండు ఎండుమిర్చి, కరివేపాకు, సరిపడా నూనె.

తయారీ విధానం..



ముందుగా కూరగాయలను బాగా శుభ్రంగా కడగాలి. చిన్నచిన్న ముక్కలుగా కోసి వాటిలో పసుపు, ఉప్పు వేయాలి. కొద్దిగా నీళ్లు పోసి కొంచెం మెత్తగా అయ్యేవరకూ ఉడికించాలి. ఆ తర్వాత కొబ్బరి పేస్ట్ తయారు చేసుకోవాలి. కొబ్బరి తురుము, శెనగపప్పు, జీలకర్రలను కలిపి కొన్ని నీళ్లు జత చేసి మెత్తగా గ్రైండ్ చేసి పేస్ట్ రూపంలో తయారు చేసుకోవాలి. ఈ కొబ్బరి పేస్టును మజ్జిగలో వేసి బాగా కలపాలి. అనంతరం ఉడికించిన కూరగాయల్లో ఈ మజ్జిగ మిశ్రమాన్ని పోయాలి.మధ్యస్థ మంటపై దాన్ని కాసేపు వేడి చేయాలి. మరిగే వరకూ ఉంచకూడదు.. కేవలం వేడి అయ్యేంత వరకు మాత్రమే ఉంచాలి. మరో పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు వేసి తాలింపు చేయాలి. ఈ తాలింపును వెంటనే పులుసులో పోయాలి. చివరిగా కొద్దిగా నెయ్యి జోడిస్తే సువాసన అద్భుతంగా ఉంటుంది. దీంతో వెజిటెబుల్ మజ్జిగ పులుసు సిద్ధమైనట్లే.. ఇది అన్నం సహా రోటీలు, జొన్న రొట్టెల్లో భలే రుచిగా ఉంటుంది.

# కేంద్రం కీలక నిర్ణయం..

## రెండేళ్ల లోపు వారికి దగ్గు మందు వాడకంపై నిషేధం..



**న్యూఢిల్లీ: దేశంలోని చిన్న పిల్లల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక సంచలన నిర్ణయానికి సిద్ధమైంది. 'డ్రాఫ్ట్ నేషనల్ ఫార్ములరీ ఆఫ్ ఇండియా 2026' ప్రతిపాదనల్లో భాగంగా.. రెండేళ్ల లోపు వయసున్న చిన్నారులకు దగ్గు, జలుబు సిరప్‌లను వాడకూడదని కఠిన నిబంధనలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. 2025లో మధ్య ప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో కలుషిత దగ్గు మందుల కారణంగా ఎంతోమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్రం ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.రెండేళ్ల లోపు చిన్నారులకు దగ్గు మందు సిఫార్స్ చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ మందులు ఇవ్వాల్సి వస్తే.. అర్హులైన డాక్టర్ల పర్యవేక్షణలో ఇవ్వాలని చెబుతున్నారు. దగ్గు మందుల్లో ఉండే కొన్ని రసాయనాలు.. ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రెండేళ్ల లోపు పిల్లల దగ్గుకు ఆవిరి పట్టడం, గోరు వెచ్చని నీరు, లిక్విడ్ ఆహారం ఇవ్వాలని చెబుతున్నారు. ఈ డ్రాఫ్ట్ నిబంధనలు త్వరలో దేశ వ్యాప్తంగా అధికారికంగా అమలు కానున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు దీనిపై అడ్వైజరీలు జారీ చేశాయి.**

# సమ్మర్‌లో రోజూ షూ వేసుకుంటున్నారా? ఈ తప్పులు చేయకండి

ఇంటర్నెట్ డెస్క్: వేసవి కాలంలో దుస్తులే కాకుండా పాదరక్షలను కూడా మార్చుకోవడం అవసరం. వేడి ఎక్కువగా ఉండే ఈ కాలంలో సౌకర్యంగా ఉండే చెప్పులు, షూలు ఎంచుకోవడం చాలా ముఖ్యం. కానీ చాలా మంది చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల పాదాల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది. సరైన పాదరక్షలు ధరించకపోతే చెమట ఎక్కువగా పట్టడం, దుర్వాసన, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీల వంటి సమస్యలు రావచ్చు.

**రోజంతా షూ ధరించడం**

వేసవిలో రోజంతా షూ ధరించడం వల్ల చెమట ఎక్కువగా పట్టి దుర్వాసన, ఫంగల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. అందుకే తేలికపాటి, మెష్ లేదా తోలు పదార్థంతో బూట్లను ఎంచుకోవడం మంచిది. ఎందుకంటే రోజంతా మూసి ఉన్న షూలు ధరిస్తే పాదాలకు గాలి తగలదు, చెమట పేరుకుపోతుంది. దీంతో బ్యాక్టీరియా పెరిగి ఇన్ఫెక్షన్లు రావడానికి అవకాశం ఉంటుంది.

**సింథటిక్ పదార్థాల చెప్పులు వాడటం..**


ప్లాస్టిక్ లేదా సింథటిక్ పదార్థాలతో చేసిన చెప్పులు గాలి సరిగా వెళ్లనివ్వవు. దీంతో చెమట లోపలే నిలిచి దుర్వాసన, ఫంగల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. అలాగే, తడిగా ఉన్న లేదా చెమట పట్టిన చెప్పులను మళ్లీ



ధరించడం మంచిది కాదు. ఇలా చేస్తే బ్యాక్టీరియా త్వరగా పెరిగి చర్మ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. అదే విధంగా, చాలా బిగుతుగా లేదా చాలా వదులుగా ఉన్న చెప్పులు ధరించడం వల్ల పాదాలకు గాయాలు, బొబ్బలు రావచ్చు. ఇవి తర్వాత ఇన్ఫెక్షన్లకు దారితీయవచ్చు. అలాగే, వేసవిలో పాదాలను శుభ్రంగా ఉంచడం చాలా అవసరం. రోజూ పాదాలను కడుక్కోకపోతే బ్యాక్టీరియా, ఫంగస్ పెరిగి సమస్యలు వస్తాయి. అలాగే చెప్పులను కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి.

# ప్యారిస్‌లో చీరకట్టుతో జాన్వీ..అందరి చూపు ఆ జ్యూయలరీ బ్లౌజ్‌పైనే!

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అందరినీ అబ్బురపరిచారు. ప్యారిస్‌లో జరిగిన ఓ గాలా ఈవెంట్‌లో ఆమె ధరించిన ప్రత్యేకమైన చీరకట్టు ఇప్పుడు అంతర్జాతీయ ఫ్యాషన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారతీయ హస్తకళకు ఆధునిక సొబగులు అద్దిన ఈ లుక్‌తో జాన్వీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమానికి జాన్వీ న్యూఢిల్లీకి చెందిన 'పంకజ్ ఎస్. హెరిటేజ్' లేబుల్ డిజైన్ చేసిన చీరను ఎంచుకున్నారు. సహజమైన ఐవరీ రంగులో ఉన్న ఈ చీరను చారిత్రక ప్రాధాన్యమున్న 460-కౌంట్ బెంగాల్ మస్లిన్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేశారు. మొఘలుల కాలంలో ఢాకా ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన ఈ వస్త్రాన్ని 'బాఫ్ట్ హవా' (నేసిన గాలి) అని పిలిచేవారు. అంతటి సున్నితమైన చీరపై తెల్లటి చికంకారీ ఎంబ్రాయిడరీ అదనపు అందాన్ని తెచ్చిపెట్టింది.అయితే, ఈ చీరకట్టులో అసలైన హైలైట్ ఆమె ధరించిన బ్లౌజ్. ఈ బ్లౌజ్ స్లీవ్స్‌ను పోల్కీలు, గార్నెట్‌లు, పచ్చలతో దట్టంగా పొదిగారు. ఈ స్లీవ్స్ భుజాలపై నుంచి జాలువారుతున్న ఆభరణాల్లా కనిపించడంతో జాన్వీ మెడలో ఎలాంటి నెక్లెస్ ధరించకుండానే సంపూర్ణమైన లుక్‌ను సాధించారు. దీనికి తగ్గట్టుగా కోల్‌కతాకు చెందిన 'విర్రాయా జ్యూయలరీ' చెవిపోగులు, కఫ్‌లతో పాటు స్లీవ్స్‌కు మ్యాచింగ్ అయ్యేలా పచ్చలు పొదిగిన ఉంగరాన్ని ధరించారు.మేకప్ ఆర్టిస్ట్ నోరా కౌర్కిస్ అందించిన సాఫ్ట్ గ్లామ్ మేకప్, స్లీక్ బన్ హెయిర్‌స్టైల్ ఈ లుక్‌ను మరింత ఉన్నతంగా నిలబెట్టాయి. మొత్తం మీద, జాన్వీ కపూర్ లుక్ భారతీయ వారసత్వ హస్తకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన వారధిలా నిలిచిందని ఫ్యాషన్ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు.



# శతక శ్రేయస్..తొలి టీ20లో విండీస్‌పై భారత్ ఘన విజయం



లక్నో: ఆసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించిన జోష్‌లో ఉన్న టీమిండియా సొంతగడ్డపై వెస్టిండీస్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఘనవిజయంతో ఆరంభించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్స్‌లతో 102 నాటౌట్) అజేయ శతకంతో రెచ్చిపోయిన వేళ మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. ఆ జట్టు నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యాన్ని భారత్ 14.4 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అయ్యర్‌కు ఇషాన్ కిషన్ (37 నాటౌట్) అండగా నిలిచాడు. తొలుత విండీస్ 19.1 ఓవర్లలో 171 రన్స్‌కు ఆలౌట్ అయింది. రూథర్‌ఫర్డ్ (34 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 56), కెప్టెన్ షై హోప్ (37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52) అర్ధ శతకాలతో రాణించారు. అరంగేట్ర బౌలర్ నమన్ ధీర్ (3/31),అక్షర్ (2/26), కుల్‌దీప్ (2/33) సత్తా చాటారు. శుక్రవారం రాంచీలో రెండో టీ20 జరగనుంది.

సర్పంచ్ సాబ్‌దే ఆట

మోస్తరు ఛేదనలో 35 పరుగులకే ఓపెనర్లను కోల్పోయినా కెప్టెన్ శ్రేయస్ ధనాధన్ మెరుపులు మెరిపించడంతో టీమిండియా విజయం నల్లేరుపై నడకే అయింది. వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్ ఇషాన్‌తో కలిసి కరీబియన్ బౌలర్లపై సర్పంచ్ సాబ్ పిడుగులా విరుచుకుపడ్డాడు. ఛేదనలో మొదటి ఓవర్లోనే 6, 4, 4తో రెచ్చిపోయిన అభిషేక్ (21)ను ఛేజ్ ఔట్ చేసి ఆ జట్టుకు తొలిబ్రేక్ ఇచ్చాడు. ఆ వెంటనే శాంసన్ (11).. అకీల్ బౌలింగ్‌లో అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దాంతో ఇషాన్‌కు జతకలిసిన అయ్యర్ మొదట్నుంచే దంచుడు మంత్రాన్ని జపించాడు. షమార్ జోసెఫ్ ఆరో ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో బాదుడుకు శ్రీకారం చుట్టిన అతడు.. ఆ తర్వాతా ఎక్కడా తగ్గలేదు. ఇషాన్ అతడికి పూర్తి సహకారమందిస్తూ స్ట్రైక్‌ను రొటేట్ చేశాడు.షెఫర్డ్ 9వ ఓవర్లోనూ శ్రేయస్ మరోసారి హ్యాట్రిక్ ఫోర్లతో అలరించాడు. 28 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన సారథి ఆ తర్వాత విధ్వంసాన్ని తారాస్థాయికి చేర్చాడు. ఫోర్డె విసిరిన 14వ ఓవర్లో మూడు సిక్స్‌లు, ఒక బౌండరీతో 24 రన్స్ రాబట్టి 90ల్లోకి వచ్చాడు. ఛేజ్ 15వ ఓవర్లో మూడో బంతిని లాంగాన్ మీదుగా భారీ సిక్స్ బాది తన కెరీర్‌లో తొలి టీ20 శతకాన్ని నమోదుచేశాడు. 42 బంతుల్లోనే అతడి సెంచరీ సాధించగా ఆ తర్వాత సింగిల్‌తో భారత గెలుపు లాంఛనమూ పూర్తయింది.

బాది.. ఆగి.. మళ్లీ బాది

ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించిన విండీస్ ఆ తర్వాత తడబాటుకు గురై క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయినా మళ్లీ ఆఖర్లో మెరుపులతో ప్రత్యర్థి ఎదుట పోరాడగలిగే స్కోరును నిలుపగలిగింది. మొదట్లో కెప్టెన్ హోప్ బౌండరీలతో భారత బౌలర్లపై విరుచుకుపడితే ఆఖర్లో రూథర్‌ఫర్డ్ మెరపులు మెరిపించాడు.ఫోర్‌తోనే వేట మొదలెట్టిన హోప్, మయాంక్ వేసిన రెండో ఓవర్లో నాలుగుసార్లు బంతిని బౌండరీ లైన్ దాటించాడు. అర్ష్‌దీప్ విసిరిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ఆఫ్‌స్టంప్‌నకు ఆవలగా వెళు ్తన్న బంతిని ఆడబోయిన ఓపెనర్ కమిల్ పూరన్ (12) ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో క్లీన్‌బౌల్డ్ అవడంతో విండీస్ తొలి వికెట్ కోల్పోయింది.ఆ వెంటనే అక్షర్ ఓవర్లో రెండో బంతికి హెట్‌మయర్ (5) రనౌట్ అవడమే గాక ఐదో బంతికి పావెల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కరీబియన్ జట్టు 44/3తో పవర్ ప్లేను ముగించింది. తర్వాత ఆ జట్టు స్కోరు వేగం కూడా నెమ్మదించింది. నమన్ వేసిన రెండో ఓవర్లో సిక్స్‌తో అర్ధ శతకాన్ని పూర్తిచేసిన హోప్.. అదే ఓవర్లో అక్షర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో కుల్‌దీప్.. ఛేజ్ (5), ఫోర్డె (2)ను పెవిలియన్‌కు పంపగా రొమారియా (7), స్ప్రింగర్ (9)ను నమన్ ఔట్ చేశాడు. ఒకవైపు సహచర బ్యాటర్లంతా విఫలమవుతున్నా రూథర్‌ఫర్డ్ మాత్రం నిలబడ్డాడు. మయాంక్ 17వ ఓవర్‌లో రెండు ఫోర్లతో జూలు విదిల్చిన అతడు.. 31 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. కానీ మయాంక్ 19వ ఓవర్లో నమన్‌కు క్యాచ్ ఇచ్చి తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్: 19.1 ఓవర్లకు 171 ఆలౌట్ (రూథర్‌ఫర్డ్ 56, హోప్ 52, నమన్ 3/31, అక్షర్ 2/26);
భారత్: 14.4 ఓవర్లకు 172/2 (శ్రేయస్ 102ఐ, ఇషాన్ 37, ఛేజ్ 1/37, అకీల్ 1/37)

# SPORTS

## ఇక మంధాన శకం..
## భారత కెప్టెన్‌గా తప్పుకున్న హర్మన్



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టులో విజయవంతమైన కెప్టెన్‌గా పేరొందిన హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోగా.. ఆమె స్థానంలో కొత్త సారథిగా స్మృతి మంధానను బీసీసీఐ ఎంపిక చేసింది. మంగళవారం గువాహటిలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం తర్వాత హర్మన్ తన నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ పోస్టు ద్వారా వెల్లడించింది. ఈ సమావేశంలో హెడ్ కోచ్ అమోల్ మజుందార్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కూడా పాల్గొన్నారు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్నా ఆటపై తనకున్న ప్రేమ తగ్గబోదని, ఇకపై ఓ ప్లేయర్‌గా అన్ని ఫార్మాట్లలో కొనసాగుతానని కౌర్ స్పష్టం చేసింది.'కెప్టెన్‌గా నా బాధ్యత ముగిసింది. జట్టు కోసం నా శక్తినంతటినీ ధారపోశాను. నా వ్యక్తిగత రికార్డులు, లక్ష్యాలను పక్కన పెట్టి ఎల్లప్పుడూ జట్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇచ్చాను. కెప్టెన్సీ ముగిసినంత మాత్రాన భారత క్రికెట్ పట్ల నాకున్న ప్రేమ తగ్గదు. కేవలం ఆటపై ఉన్న మక్కువతో మైదానంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాను' అని భావోద్వేగంగా రాసుకొచ్చింది. 2016లో టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన హర్మన్‌ప్రీత్, 2022లో వన్డేలకు, 2023లో అన్ని ఫార్మాట్లకు సారథిగా ఎంపికైంది. ఆమె నాయకత్వంలోనే గతేడాది తొలిసారి వన్డే ప్రపంచ కప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన భారత్ వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో పసిడి పతకం గెలిచింది. మొత్తంగా హర్మన్ 5 టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20 మ్యాచ్‌ల్లో భారత జట్టుకు నాయకత్వం వహించింది.అయితే కొంతకాలంగా తను బ్యాటర్‌గా తీవ్రంగా నిరాశపరుస్తోంది. ఇటీవలి టీ20 ప్రపంచ కప్‌లో భారత్ కనీసం సెమీఫైనల్ చేరలేకపోవడంతో ఆమెపై విమర్శలు వచ్చాయి.

షెఫాలీ, దీప్తికి వైస్ కెప్టెన్సీ..

హర్మన్ తప్పుకోవడంతో ఊహించినట్టుగానే వైస్ కెప్టెన్ మంధానకే సారథ్య బాధ్యతలు దక్కాయి. డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీ జట్టును రెండు సార్లు విజేతగా నిలిపిన మంధాన ఇప్పటికే తన నాయకత్వ ప్రతిభను నిరూపించుకుంది. దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం చాలా ప్రత్యేకమైన గౌరవమని మంధాన చెప్పింది. స్వదేశంలో ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో మంధాన కెప్టెన్సీలో భారత్ బరిలోకి దిగనుంది. రెండు సిరీస్‌ల్లో పాల్గొనే జట్లనుఎంపిక చేసిన సెలెక్టర్లు టీ20ల్లో షెఫాలీకి, వన్డేల్లో దీప్తి శర్మకు వైస్ కెప్టెన్సీ అప్పగించారు.